# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | మంగళవారం 10-12-2019 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 115 | పేజీలు: 4 | వెల: రూ.1/-


## మళ్లీ చలిపులి పంజా

### పడిపోతున్న ఉష్ణోగ్రతలు

హైదరాబాద్,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): తెలుగు రాష్ట్రాల్లో మరోమారు ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. దీంతో చలిగాలుల తీవ్రత పెరిగింది. ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్‌లలో చలి తీవ్రత పెరిగింది. విశాఖ మన్యంలో కూడా చలి పెరిగింది. హైదరాబాద్ నగరంలో శీతల గాలులు వణికిస్తున్నాయి. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతున్నా.. చలి తీవ్రత ఎక్కువ ఉంటోంది. పొడి వాతావరణం నెలకొంది. క్రితం రోజు కూడా ఇంచుమించు ఇదే స్థాయిలో కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో రాత్రి, ఉదయం వేళల్లో చలి ప్రభావం ఎక్కువగా ఉంటోంది. శివారు ప్రాంతాల్లో చలిగాలుల తీవ్రత ఎక్కువే ఉంది. ఇక్కడ సాధారణం కంటే రెండు డిగ్రీల వరకు తక్కువ కనిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డవుతున్నాయి. విశాఖపట్నం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో రోజురోజుకూ ఉష్ణోగ్రతలు కనిష్టస్థాయిలో నమోదు అవుతున్నాయి. ఏజెన్సీలో చలి తీవ్రత పెరుగుతూ ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

## కామారెడ్డి జిల్లాలో ఘోర ప్రమాదం

### - చెట్టును ఢీకొన్న కారు..

# నలుగురు మృతి



కామారెడ్డి, డిసెంబర్9(ఆర్ఎన్ఎ) : కామారెడ్డి జిల్లాలో సోమవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. భిక్కనూరు మండలం జంగంపల్లి శివారులో కృష్ణ మందిర్ సమీపంలో ఓ కారు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు లావణ్య(35), రోషిణి(14), సుశీల్(28), ప్రశాంత్(26) అక్కడికక్కడే మృతి చెందారు. కారు వేగంగా వచ్చి చెట్టును ఢీకొనడంతో కారులో మృతదేహాలు ఇరుక్కుపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటీన ఘటన స్థలికి చేరుకున్నారు. అప్పటికే ప్రాణాలు కోల్పోయి, కారులో ఇరక్కుపోయిన మృతదేహాలను పోలీసులు గ్యాస్ కట్టర్‌తో కారు భాగాలను విడదీసి మృతదేహాలను బయటకు తీశారు. మృతుల్లో డ్రైవర్ ప్రశాంత్ ది నిజామాబాద్ జిల్లా నవీపేట కాగా.. మిగతా ముగ్గురు నిజామాబాద్ కేంద్రంలోని పద్మానగర్‌కు చెందిన మంథని లావణ్య, రోషిణి, సుశీల్‌గా గుర్తించారు. ప్రమాదం విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# యడియూరప్ప సర్కార్ సేఫ్!

### - కర్ణాటక ఉప ఎన్నికల్లో కమలం హవా
### - 12చోట్ల బీజేపీ అభ్యర్థుల జయభేరి
### - 117ఎమ్మెల్యేలకు చేరిన యెడియూరప్ప సర్కార్ బలం

బెంగళూరు, డిసెంబర్9(ఆర్ఎన్ఎ) : కర్ణాటకలో బీజేపీ సుస్థిర పాలనకు మార్గం సుగమమైంది. సోమవారం వెలువడిన ఉప ఎన్నికల్లో ఫలితాల్లో ఆపార్టీ అభ్యర్థులు 12మంది విజయదుందబి మోగించడంతో బీజేపీ ప్రభుత్వం ఊపిరిపీల్చుకుంది. నిన్నటివరకు 105 మంది ఎమ్మెల్యేలతో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని స్థితిలో పాలన సాగించిన యడియూరప్ప ప్రస్తుతం 117 మంది సభ్యులతో పాలన సాగించనున్నారు. సోమవారం వెలువడిన ఫలితాల్లో అత్యధిక స్థానాల్లో విజయం సాధించడంతో కర్ణాటక సీఎం యెడియూరప్ప, బీజేపీ నేతలు సంతోషం వ్యక్తంచేశారు. ఎంతో ఉత్కంఠగా సాగిన 15అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికల్లో భాజపా 12చోట్ల జయభేరీ మోగించింది. ఇక కాంగ్రెస్ కేవలం 2 స్థానాలకే పరిమితమవగా.. జేడీఎస్ కనీసం ఖాతా తెరవలేకపోయింది. మరో చోట స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో భాజపా, కాంగ్రెస్ మొత్తం 15 చోట్ల పోటీ చేయగా.. జేడీఎస్ 12 చోట్ల బరిలోకి దిగింది. ఫలితాల్లో గోకాక్, కాగవాడ, అథణి, యల్లాపుర, రాణెళిబెన్నూరు, హీరెకెరూరు, కె.ఆర్. పురం, మహాలక్ష్మిలేఔట్, యశవంతపుర, విజయనగర, కె.ఆర్. పేట, చిక్కబళ్లాపుర నియోజకవర్గాల్లో భాజపా అభ్యర్థులు విజయం సాధించారు. హుణసూరు, శివాజినగరలో కాంగ్రెస్ గెలుపొందింది. హొళసకోటె నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన భాజపా రెబల్ నేత శరత్ కుమార్ గౌడ విజయం సాధించారు. అయితే, ఆయన కూడా తిరిగి భాజపాలో చేరే అవకాశాలు కన్పిస్తున్నాయి. కాంగ్రెస్-జేడీఎస్ కూటమికి చెందిన 17మంది తిరుగుబాటు చేయడంతో కర్ణాటకలో కుమారస్వామి నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం కూలిపోయిన విషయం తెలిసిందే. ఆ తర్వాత తిరుగుబాటు ఎమ్మెల్యేలపై నాటి స్పీకర్ అనర్హత వేటు వేయడం.. ఆ వ్యవహారం సుప్రీంకు వెళ్లడం.. కోర్టు ఆదేశాల మేరకు జరిగిన బలపరీక్షలో భాజపా నెగ్గి యడియూరప్ప సర్కార్ ఏర్పడటం చకచకా జరిగిపోయాయి. కాగా.. స్పీకర్ చర్యతో అసెంబ్లీలో సభ్యుల సంఖ్య 224 నుంచి 207కు పడిపోయింది. ఇక ఎమ్మెల్యేల అనర్హతతో 17స్థానాలకు ఉపఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా హైకోర్టులో కేసుల కారణంగా రెండు చోట్ల ఎన్నికలు వాయిదా పడ్డాయి. దీంతో డిసెంబరు 5న 15 శాసనసభ నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు నిర్వహించారు. ప్రస్తుతం అసెంబ్లీలో భాజపా సంఖ్యా బలం 105. తాజా ఫలితాల్లో మరో 12 చోట్ల గెలుపొందడంతో భాజపా బలం 117కు పెరిగింది. అంటే రాష్ట్రంలో స్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన స్పష్టమైన మెజార్టీ కాషాయ పార్టీకి దక్కింది. అలా యెడియూరప్ప ప్రభుత్వం తిరిగి అధికారాన్ని నిలబెట్టుకుంది

### బీజేపీకి ఇది గొప్ప విజయం
### - సీఎం యెడియూరప్ప

ఉప ఎన్నికల ఫలితాల్లో 15 స్థానాలకు బీజేపీ 12 స్థానాల్లో గెలవడం తమ పార్టీకి గొప్ప విజయమని కర్ణాటక సీఎం యెడియూరప్ప స్పష్టం చేశారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.. ఇప్పటికైనా ప్రతిపక్షం తమపై ఆరోపణలు చేయడం మానాలని సూచించారు. ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. రాబోయే మూడున్నరేండ్లు కర్ణాటకలో సుస్థిర ప్రభుత్వం కొనసాగుతోందని యెడియూరప్ప తేల్చిచెప్పారు. ఈ ఉప ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యేలకు మంచి భవిష్యత్ ఉంటుందని సీఎం హామీనిచ్చారు. వీరికి ప్రభుత్వంలో ఉన్నత పదవులిచ్చే అంశంపై రెండు, మూడు రోజుల్లో ఢిల్లీ వెళ్లి

పార్టీ పెద్దలతో మాట్లాడుతానని సీఎం యెడియూరప్ప పేర్కొన్నారు. ఇదిలా ఉంటే కర్ణాటక ఉప ఎన్నికల్లో బీజేపీ విజయదుందబి మోగించడంతో ఇదిలా ఉంటే ఉప పోరులో 12 మంది ఎమ్మెల్యేలను గెలుచుకోవటంతో యెడియూరప్ప కుమారుడు విజయేంద్రతో సంబరాలు జరుపుకున్నారు. తండ్రి యెడియూరప్ప కుమారుడు ఒకరినొకరు స్వీట్లు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా విజయేంద్ర తండ్రి ఆశీర్వాదాన్ని తీసుకున్నారు.

### ఓటమిని అంగీకరిస్తున్నాం - కాంగ్రెస్ నేత డీకే శివకుమార్

కర్ణాటక ఉప ఎన్నికల ఫలితాల్లో అధికార భాజపా అభ్యర్థులు విజయంపై ఆ రాష్ట్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత డీకే శివకుమార్ స్పందించారు. ఈ 15 నియోజకవర్గాల్లో ప్రజల తీర్పును స్వీకరిస్తున్నామని, ఫిరాయింపుదారులను ప్రజలు ఒప్పుకున్నారని, అందుకే మేం ఓటమిని అంగీకరిస్తున్నామని అన్నారు. ఇందుకు మేం బాధపడాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు.

## ఫిబ్రవరి 21 వరకు అక్రమ నల్లా కనెక్షన్లను క్రమబద్ధీకరించుకోండి..



హైదరాబాద్, డిసెంబర్ 9:: అక్రమంగా పొందిన నల్లా కనెక్షన్లను క్రమబద్ధీకరించడానికి వీడీఎస్ (వాలంటరీ డిస్‌క్లోజర్ స్కీం) 2019 పథకం అమలవుతుందని, ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రజలను కోరారు. విశ్వనగరంగా అభివృద్ధి చెందుతూ 1628 చదరపు కిలోమీటర్ల వైశాల్యంతో ఔటర్ రింగ్ రోడ్ లోపల గ్రామాల వరకు జలమండలి రోజూ 472 మిలియన్ గ్యాలన్ల నీటిని అందిస్తున్నారని మంత్రి తలసాని వివరించారు. ప్రతి వెయ్యి లీటర్లకుగాను 47 రూపాయలు ఖర్చు చేస్తూ 214 కోట్ల 76 లక్షల లీటర్లను ప్రతి రోజూ జలమండలి నగరంలోని కోటికిపైగా ఉన్న జనాభా దాహార్తిని తీర్చడానికి కృషి చేస్తుందన్నారు.

సరఫరా చేస్తున్న నీటిలో 37 శాతం వివిధ కారణాలతో నీరు వృథా కావడం వల్ల ఈ నీటిని సంబంధించిన ఆదాయం జలమండలికి రావడం లేదన్నారు. ప్రజలు తమ ఇంటి పరిసరాల్లో పెద్ద ఎత్తున నీటిని వృథా చేయడం, మరికొంత మంది అక్రమంగా నీటి కనెక్షన్స్ కలిగి ఉండడం, ఈ వృథా అవుతున్న నీటి ద్వారా జలమండలికి ప్రతి నెల సుమారు 20 కోట్ల నష్టం వాటిల్లుతున్నదని పేర్కొన్నారు. ఎన్నో వ్యయ ప్రయాసలతో ఎంతో దూరం నుంచి తెస్తున్న మంచినీటిని జలమండలి పేద వారికి సబ్సిడీ ధరపై ప్రతి వెయ్యి లీటర్లకు ఏడు రూపాయిలు, ఇతరులకు 10 రూపాయలకే అందిస్తుందని తెలిపారు. నగరంలోని ఎంతో మంది అక్రమ కనెక్షన్ల ద్వారా నీటిని చౌర్యం చేస్తూ బోర్డు ఆదాయానికి గండికొడుతున్నారని తెలిపారు.

వచ్చే ఫిబ్రవరి 21 వరకు అవకాశం

అక్రమ నీటి కనెక్షన్ విషయమై ఇటీవల ప్రభుత్వానికి విన్నవించినప్పుడు వాలంటరీ డీస్ క్లోజర్ స్కీం-2019కు అనుమతులు ఇచ్చిందని, వచ్చే ఫిబ్రవరి 21వ తేదీ వరకు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. గతంలో అక్రమ నల్లా కనెక్షన్ క్రమబద్ధీకరించుకోవడానికి మూడు సంవత్సరాల మంచినీటి బిల్లుతో పాటు రెట్టింపు కనెక్షన్‌చార్జీలు పెనాల్టీగా కట్టాల్సి వచ్చేదన్నారు. వీడీఎస్-2019 ప్రకారం ఎలాంటి పెనాల్టీ లేకుండా ఒక కనెక్షన్ చార్జీ, ఒక నెలకు వచ్చే బిల్లు చెల్లించి అక్రమ నీటి కనెక్షన్లను క్రమబద్ధీకరించుకోవచ్చని తెలిపారు. ఈ విధంగా అక్రమ నల్లా కనెక్షన్లను క్రమబద్ధీకరించుకోవడం వల్ల వినియోగదారులకు అధికారికంగా జలమండలి సేవలు అందించబడతాయని మంత్రి తలసాని తెలిపారు. జలమండలి సైతం వచ్చే ఆదాయం పెరిగి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందని మంత్రి వివరించారు. ఈ సదవకాశాన్ని నవంబర్ 22 నుంచి వచ్చే ఫిబ్రవరి 21వరకు 90 రోజుల వరకు అక్రమ నీటి కనెక్షన్‌దారులందరూ సద్వినియోగం చేసుకోవడానికి సమీపంలో ఉన్న జలమండలి కార్యాలయ అధికారులను సంప్రదించవచ్చన్నారు. 155313 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

## యాదాద్రి ఆలయాన్ని దర్శించుకున్న గవర్నర్ తమిళిసై

### ఘనంగా స్వాగతం పలికిన మంత్రి జగదీశ్వర్ రెడ్డి



యాదాద్రి భువనగిరి, డిసెంబర్9(ఆర్ఎన్ఎ) : గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ సోమవారం యాదాద్రి ఆలయాన్ని దర్శించుకున్నారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం ఉదయం యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని గవర్నర్ తమిళిసై దంపతులు దర్శించుకున్నారు. బాలాలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు వేదాశీర్వచనాలు అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అంతకుముందు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి, ఆలయ ఈవో, అధికారులు, వేద పండితులు గవర్నర్‌కు స్వాగతం పలికారు. యాదాద్రి పునర్నిర్మాణ పనులను మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి గవర్నర్‌కు వివరించారు.

తొలిసారి యాదాద్రి ఆలయానికి వచ్చిన గవర్నర్ తమిళిసైకి ఘనంగా ఏర్పాట్లు చేశారు. మంత్రి జగదీశ్వర్ రెడ్డి, ఆలయ ఇవో గీత, కలెక్టర్ అనితా రామచంద్రన్, ఎమ్మెల్యే గొంగిడి సునీత తదితరులు స్వాగతం పలికారు. గవర్నర్ రాకతో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకున్నారు. మరోవైపు తమిళిసై వరంగల్ నగరానికి చేరుకొని అక్కడ కాకతీయుల కోటలోని చారిత్రక కట్టడాలను పరిశీలించారు.

## అత్తింటి వేధింపులకు మరో అబల బలి

### వరకట్న బాధలు తట్టుకోలేక ఆత్మహత్య

హైదరాబాద్,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): కట్టుకున్న భర్త, అత్త వేధింపులు భరించలేక ఓ వివాహిత ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బోరబండ రాజ్‌నగర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై అశోక్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని హైదర్‌నగర్‌లో ఉంటున్న స్వామి బుచ్చమ్మ దంపతుల కుమారుడు దారుపల్లి రామారావు మెదక్ జిల్లా నర్సాపూర్‌కు చెందిన బోడా కృష్ణ జయమ్మ కూతురు మీనాను మూడేండ్ల క్రితం కట్న కానుకలు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఒక బాబు కూడా జన్మించాడు. రామారావు ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తుండగా, మీనా ఇంటి వద్దనే ఉంటున్నది. కాగా, కొంత కాలంగా భర్త, అతని తల్లి బుచ్చమ్మ అదనపు కట్నం తేవాలని వేధిస్తున్నారని తల్లి, సోదరునికి తెలిపింది. ఈ క్రమంలో శనివారం రామారావు ఇంటికి చేరుకున్న బావమరది వెంకన్న తమ ఇంట్లో శుభకార్యం ఉన్నది పంపించాలని చెప్పి ఇంటికి తీసుకువెళ్లాడు. భర్త పెడుతున్న వేధింపులు తల్లితో చెప్పి ఇంట్లో ఫ్యాన్ కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గదిలో ఉన్న కూతురు ఎంతకీ బయటకు రాకపోవడంతో లోనికి వెళ్లి చూడగా, అప్పటికే ఫ్యాన్‌కు ఉరేసుకొని ఉన్నది. దీంతో కిందికి దించిచూడగా, అప్పటికే మృతి చెందింది. పోలీసులకు సమాచారం అందించగా, ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతురాలు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

## ఇంటికి చేరుకున్న లతా మంగేష్కర్

ముంబై,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): తీవ్ర అస్వస్థతతో ముంబైలోని బ్రీచ్‌కాండీ ఆసుపత్రిలో చేరిన బాలీవుడ్ సీనియర్ గాయని లతామంగేష్కర్ 28 రోజుల తర్వాత ఇల్లు చేరారు. భారతరత్న అవార్డు గ్రహీత అయిన 90 ఏళ్ల లత ఆదివారం మాట్లాడుతూ.. తనకు న్యూమోనియా ఉన్నట్టు వైద్యులు నిర్ధారించినట్టు తెలిపారు. 28 రోజులపాటు ఆసుపత్రిలో చికిత్స తీసుకున్న అనంతరం ఇంటికి చేరుకున్నట్టు పేర్కొన్నారు. తానిప్పుడు పూర్తి ఆరోగ్యంగా ఉన్నానని, తన క్షేమాన్ని కాంక్షించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నట్టు పేర్కొన్నారు.

## విరక్తితో యువతి ఆత్మహత్య

హైదరాబాద్,డిసెంబర్9 (ఆర్ఎన్ఎ):జీవితంలో స్థిరపడాలని ఆమె చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడింది. జూబ్లీహిల్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నం.10లో నివాసం ఉండే యువతి అమల(25) నాలుగేండ్లుగా అమెరికాలో ఉండి ఇటీవల నగరానికి వచ్చింది. తన జీవితంలో ఏదీ సరిగా జరగడం లేదంటూ కొన్నిరోజులుగా కుటుంబసభ్యులతో చెబుతుండేది. శనివారం రాత్రి ఆరోగ్యం బాగలేదంటూ గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుంది. అర్ధరాత్రి అయినా బయటకు రాకపోవడంతో తల్లిదండ్రులు కిటికీలో నుంచి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకొని ఉన్నది. ఆమెను కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని యువతి గదిలో లభించిన సూసైడ్‌నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దవాఖానకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కాంగ్రెస్‌కు ప్రజలు గుణపాఠం చెప్పారు : ప్రధాని మోదీ



హైదరాబాద్, డిసెంబర్ 9: కర్నాటకలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు గుణపాఠం చెప్పారని ప్రధాని మోదీ అన్నారు. జార్ఖండ్‌లోని హజారిబాగ్‌లో జరిగిన ఓ సభలో ఆయన మాట్లాడారు. ప్రజాతీర్పును కాంగ్రెస్ పార్టీ అక్రమంగా దోచేసిందని, అందుకే ఇప్పుడు మళ్లీ ప్రజలు కర్నాటకలో బీజేపీని గెలిపించారని మోదీ అన్నారు. తాజాగా జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ క్లీన్ స్వీప్ చేసింది. బీజేపీనే స్థిరమైన ప్రభుత్వాన్ని అందిస్తుందన్నారు. దక్షిణ భారత దేశంలో బీజేపీ పాత్ర స్వల్పమే అన్న వారికి ఇది చెంపపెట్టు అని అన్నారు. కర్నాటకలో కాంగ్రెస్ పార్టీ ప్రజాతీర్పును వెన్నుపోటు పొడిచిందని, ఇప్పుడు ఆ పార్టీలు గుణపాఠం నేర్చుకున్నాయన్నారు. ఇవాళ వెలుబడిన ఉప ఎన్నికల ఫలితాల్లో గెలిచినవారిలో 11 మంది అనర్హత ఎమ్మెల్యేలే ఉన్నారు.

## చరిత్రలో నేటినిజం



!!క!! రాజులు, మాజులు,
రాజులు వెలుగు "రామలింగారెడ్డిన్
ధీరుని, విమర్శనాగ్రణి
బీరుని మన "కట్టమంచి" విదుని దలంతున్ !!

(డిసెంబర్ 10 కట్టమంచి రామలింగారెడ్డి జయంతి)

-రాధశ్రీ

సెల్: 9494481210



## సోనియాకు మోడీ బర్త్‌డే విషెస్

న్యూఢిల్లీ,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. దేశవ్యాప్తంగా పార్టీలకు అతీతంగా నేతలు ఆమెకు ఆయురారోగ్యాలు కలగాలని కోరుతూ, ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కూడా సోనియా గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఆయన ఇచ్చిన ఓ ట్వీట్‌లో శ్రీమతి సోనియా గాంధీ గారికి జన్మదిన శుభాకాంక్షలు. ఆమె ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థిస్తున్నాను అని పేర్కొన్నారు. ఇదిలావుండగా కాంగ్రెస్ ఇచ్చిన ఓ ట్వీట్‌లో సోనియా గాంధీ తరతరాల కాంగ్రెస్ నేతలకు స్ఫూర్తినిచ్చారని పేర్కొంది. సుదీర్ఘకాలం కాంగ్రెస్ అధ్యక్ష పదవిని నిర్వహించిన ఆమె తమను సమైక్యపరిచారని తెలిపింది.

## మతం ఆధారంగా కాంగ్రెస్సే దేశాన్ని విభజించింది : అమిత్ షా

హైదరాబాద్, డిసెంబర్ 9: భారతదేశాన్ని మతం ఆధారంగా కాంగ్రెస్ పార్టీ దేశాన్ని విభజించినట్లు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. ఇవాళ లోక్‌సభలో పౌరసత్వ సవరణ బిల్లు చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజ్యాంగాన్ని ఉల్లంఘించడం లేదన్నారు. ఇది మైనార్టీలకు వ్యతిరేకం కాదన్నారు. దేశవిభజనకు కాంగ్రెసే కారణమన్నారు. మతం ఆధారంగా దేశాన్ని కాంగ్రెస్ విభజించకుంటే.. ఇప్పుడు ఇలాంటి పౌరసత్వ బిల్లును తీసుకురావాల్సి వచ్చేది కాదన్నారు. పౌరసత్వ సవరణ బిల్లు ఆర్టికల్ 11, ఆర్టికల్ 14లను ఉల్లంఘిస్తోందని విపక్షాలు ఆందోళన చేపట్టాయి. అయితే ఆ ఆరోపణలను షా కొట్టిపారేశారు. మతం ఆధారంగా ప్రభుత్వం చట్టాలను చేసేందుకు ఆర్టికల్ 14 అడ్డుకోదని షా అన్నారు. 1971 తర్వాత బంగ్లాదేశ్ నుంచి వచ్చిన వారికి మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ఎలా పౌరసత్వాన్ని కల్పించారో కేంద్ర మంత్రి తెలిపారు. మరి అప్పట్లో పాకిస్థాన్ వారికి ఎందుకు ఆ అర్హత కల్పించలేదని ఆయన ప్రశ్నించారు. ఉగాండా నుంచి వచ్చిన వారికి కూడా గత ప్రభుత్వాలు పౌరసత్వం కల్పించాయన్నారు. రిజర్వేషన్లు కల్పించినప్పుడు ఆర్టికల్ 14 గుర్తుకు రాలేదా అని ఆయన విపక్షాలను ప్రశ్నించారు. పాకిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్ దేశాలు ఇస్లాం మతాన్ని పాటిస్తున్నాయని, దేశ విభజన సమయంలో భారత్, పాక్‌లు మైనార్టీ రక్షణ కోసం ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు చెప్పారు. పౌరసత్వ సవరణ బిల్లును లోక్‌సభలోప్రవేశపెట్టడానికి ఓటింగ్ జరిగింది. ఆ ఓటింగ్‌లో అనుకూలంగా 293 ఓట్లు పడ్డాయి, వ్యతిరేకంగా 82 మంది సభ్యులు ఓటేశారు.

# శరణార్థులందరికీ పౌరసత్వం కల్పించాలి!!

నేటి నిజం
మంగళవారం 10-12-2019

దాదాపు ముప్పయి ఐదువేల మంది శరణార్థులు మన దేశపు పౌరసత్వం పొందడానికి ఏళ్లతరబడి వేచి ఉండవలసి రావడం ఘోరమైన వైపరీత్యం. రెండు కోట్ల మందికి పైగా బంగ్లాదేశీయులు ఇతర ఇరుగు పొరుగు దేశాలవారు దశాబ్దుల తరబడి మన దేశంలోకి అక్రమంగా ప్రవేశించారు. ఇలాంటి అక్రమ ప్రవేశకులను దేశం నుండి వెళ్లగొట్టకపోవడం మన దేశపు అంతర్గత భద్రతకు భంగం కలిగిస్తున్న వైపరీత్యం. ఇలాంటి అక్రమ ప్రవేశకులు ఎక్కువమంది పశ్చిమ బెంగాల్‌లోను, అస్సాంలోను, ఈశాన్యంలోను తిష్ఠవేసి ఉన్నారు. దేశమంతటా కూడ లక్షల మంది అక్రమ ప్రవేశకులు స్థిరపడి ఉన్నారు. అక్రమ ప్రవేశకులను వెళ్లగొట్టే ప్రక్రియను వ్యతిరేకిస్తున్నవారే శరణార్థులకు భారతీయ పౌరసత్వాన్ని కల్పించే ప్రక్రియను వ్యతిరేకిస్తున్నారు. ఇదీ మన దేశానికి మాత్రమే పరిమితమైన విచిత్రం. రెండు కోట్ల మందికి పైగా 'అక్రమ ప్రవేశకులు' దేశమంతటా విస్తరించారన్నది దశాబ్దుల తరబడి జరిగిన ప్రచారం. ఈ అక్రమ ప్రవేశకులలో కొన్ని వేల మంది 'జిహాదీ' బీభత్సకారులు కూడ ఉన్నట్టు ప్రచారమైంది. కానీ అక్రమ ప్రవేశకులను వెళ్లగొట్టరాదన్నది మన దేశంలోని కొన్ని రాజకీయ పక్షాల అభిమతం! ఇలాంటివారు అస్సాంలో రూపొందిన 'జాతీయ పౌరసత్వ సూచిక'ను వ్యతిరేకించారు, వ్యతిరేకిస్తున్నారు. ఈ 'జాతీయ పౌరసత్వ సూచిక'-నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజెన్స్-ఎన్ఆర్‌సి-ప్రకారం అస్సాంలోనే దాదాపు పంతొమ్మిది లక్షల మంది విదేశీయులు అక్రమంగా చొరబడినవారు ఉన్నట్టు ధ్రువపడింది! ఈ పంతొమ్మిది లక్షల మంది అక్రమ ప్రవేశకులకు సైతం మన దేశపు పౌరసత్వం ఇవ్వాలని వాదిస్తున్నవారే 'శరణార్థుల'కు మన దేశపు పౌరసత్వం ఇవ్వరాదని కోరుతున్నారు. ఇదీ వీరి మానసిక బీభత్స వైచిత్రి!!

ఇలా లక్షల మంది ధ్రువపడిన అక్రమ ప్రవేశకులు, మరికొన్ని లక్షల మంది ధ్రువపడని అక్రమ ప్రవేశకులు అస్సాంలోను, ఈశాన్యంలోను తిష్ఠవేసి ఉండడం గురించి పట్టించుకోనివారు, కొన్ని వేల మంది 'శరణార్థులు'-అఫ్ఘానిస్థాన్ నుంచి పాకిస్థాన్ నుంచి బంగ్లాదేశ్ నుంచి తరిమివేతకు గురయిన నిస్సహాయులు- ఈశాన్యంలో స్థిర నివాసం ఏర్పరచుకోవడం వల్ల ప్రమాదం సంభవిస్తుందని ఆర్భాటిస్తున్నారు.

పౌరసత్వపు చట్టానికి జరుగుతున్న సవరణ వల్ల 2014 డిసెంబర్ 31కి ముందు ఈ మూడు దేశాలనుంచి శరణార్థులై వచ్చిన ముప్పయి ఐదువేల మందికి మాత్రమే భారతీయ పౌరసత్వం లభిస్తుందట. వీరందరూ దేశంలోని వివిధ ప్రాంతాలలో స్థిరపడి ఉన్నారు. అందువల్ల ఈశాన్యంలోని ఈ ఆరు ప్రాంతాలలో స్థిరపడేవారు ఐదారు వేల మంది కూడ ఉండబోరు.

మొత్తం ఈ ముప్పయి ఐదువేల మంది శరణార్థులు కూడ ఈశాన్యంలో స్థిరపడినప్పటికీ రాగల ప్రమాదం ఏమీ లేదు. అందువల్ల పౌరసత్వపు 'సవరణ'ను ఈశాన్య ప్రాంతానికి వర్తింపచేయకపోవడం 'ఒకే దేశం- ఒకే ప్రజ'- వన్ నేషన్ వన్ పీపుల్- స్ఫూర్తికి విరుద్ధం, రాజ్యాంగ సర్వసమగ్ర అన్వయ సూత్రానికి వ్యతిరేకం! ఈ వైరుధ్యానికి, ఈ 'వ్యతిరేకత'కు ఏడు దశాబ్దుల ప్రతీక అయిన రాజ్యాంగంలోని మూడువందల డెబ్బయ్యవ అధికరణం ఆగస్టులో రద్దయింది. విచ్ఛిన్న వాదాన్ని పెంచిన 'కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి' రద్దయింది. కానీ పౌరసత్వపు సవరణ 'బిల్లు' ఈశాన్యంలోని ఆరు ప్రాంతాలకు వర్తించదని నిర్దేశించడం ఈ ప్రాంతాలకు 'కశ్మీర్ తరహా ప్రత్యేకత'ను కల్పించడం మాత్రమే కాగలదు. ఇలా ఆరు ప్రాంతాలకు ఈ 'సవరణ' వర్తించబోదని చెబుతున్న ప్రభుత్వం 'మణిపూర్'కు మాత్రం ఈ మినహాయింపు ఇవ్వడం లేదు... ఎందుకని?

## ఆటోలో మహిళ శవంతో వచ్చిన వ్యక్తి

### ఫిర్యాదు చేసేలోగా పరార్
### దర్యాప్తు చేస్తున్న పోలీసులు

ముంబయి,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): మహారాష్ట్రలోని కల్యాణ్ రైల్వే స్టేషన్ సమీపంలో బస్తాలో తలలేని మహిళ మొండాన్ని గుర్తించారు. మహిళ మృతదేహం సంచిలో మూడు భాగాలు ఉన్నట్టు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కల్యాణ్ రైల్వే స్టేషన్‌లో నుంచి ఓ వ్యక్తి బయటకు వచ్చి బివాండి వెళ్లడానికి ఆటో కావాలని అడిగాడు. ఆ వ్యక్తి బ్యాగ్ తీసుకొని ఆటోలో కూర్చోగానే డ్రైవర్‌కు వాసన వచ్చింది. బ్యాగ్‌లో ఏముందని డ్రైవర్ ప్రశ్నించగానే తత్తరపాటుతో ఆ వ్యక్తి సమాధానమిచ్చాడు. వెంటనే ఆటో డ్రైవర్ తన సహచర డ్రైవర్లకు సమాచారం ఇచ్చారు. అప్పటికే నిందితుడు ఆటోలో నుంచి పారిపోయాడు. డ్రైవర్ల సమాచారం మేరకు మహాత్మా పులే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బ్యాగ్‌ను ఓపెన్ చేశారు. బ్యాగ్‌లో తలలేని మూడు భాగాలుగా కట్ చేసిన మహిళ మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులు కేసు నమోదు చేసి రైల్వే స్టేషన్ లో ఉన్న సిసి కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు. రెండు రోజుల క్రితం మహిళను చంపడంతో మృతదేహం నుంచి వాసన వస్తోందని పోలీస్ అధికారి ప్రకాశ్ లోండే తెలిపాడు. తిత్వా నుంచి వచ్చిన లోకల్ రైలు నుంచి నిందితులు దిగినట్టుగా పోలీసులు గుర్తించారు. మహిళ మృతదేహం ఉన్న బ్యాగును పట్టుకొని ఇద్దరు వ్యక్తులు సంచరించినట్టు పోలీసులు గుర్తించారు. తిత్వా పోలీస్ స్టేషన్ పరిధిలో మిస్సింగ్ కేసులపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. మృతురాలు వయసు 25 నుంచి 30 ఏళ్లు ఉంటుందని పోలీసులు గుర్తించారు.

## ప్రమాదానికి గురైన ఫ్యాక్టరీలోనే మళ్లీ మంటలు

### రంగంలోకి దిగిన అగ్నిమాపక దళాలు

న్యూఢిల్లీ,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): ఉత్తర ఢిల్లీలోని అనాజ్ మండిలో మరోమారు మంటలు చెలరేగాయి. అయితే అప్రమత్తం కావడంతో మరింతప్రమాదం తప్పింది. ఆదివారం తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో నాలుగు అంతస్థుల భవనంలో మంటలు చెలరేగిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో 43 మంది ప్రాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. తాజాగా సోమవారం ఉదయం అనాజ్ మండిలో మళ్లీ అగ్ని ప్రమాదం సంభవించింది. ప్రమాదానికి గురైన ఫ్యాక్టరీలోనే మళ్లీ మంటలు చెలరేగాయి. నాలుగు ఫైరిరజన్లు వెంటనే ఘటనాస్థలానికి చేరుకొని మంటలు ఆర్పుతున్నాయి. మంటలు త్వరితగతిన వ్యాపించడంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ కమ్మేసింది.

## మహిళపై లైంగిక వేధింపులు

### కొడవలితో దాడి చేసిన దుండగుడు

రాయ్‌పూర్,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): మహిళను లైంగికంగా వేధించిడమే కాకుండా ఆమెపై కొడవలితో నిందితుడు దాడి చేసిన సంఘటన ఛత్తీస్‌గఢ్‌లోని కోర్బా ప్రాంతంలో చోటుచేసుకుంది. ఆమె పరిస్థితి విషమంగా ఉందని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రపాల్ తోండే అనే వ్యక్తి ఓ మహిళను తరుచుగా వేధిస్తుండడంతో సదరు మహిళ మరో ఇంటికి మారింది. ఇల్లు మారిన కూడా ఇంద్రపాల్ లైంగిక వేధింపులు తగ్గలేదు. సదరు మహిళ స్నానం చేస్తుండగా వీడియో తీసి సోషల్ మీడియాలో షేర్ చేశాడు. దీంతో ఆమె స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వెంటనే నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బెయిల్‌పై విడుదలైన నిందితుడు డిసెంబర్ ఆరో తేదీన పనికి వెళ్తున్న మహిళ మెడ, ముఖంపై కొడవలితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను పోలీసులు స్థానిక ఆస్పత్రికి తరలించారు. పోలీసులు వెంటనే ఇంద్రపాల్ ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు



## హరితహారంలో మొక్కను ఢీకొన్న సుమో

### వాహనదారుడికి భారీ జరిమానా

సిద్దిపేట,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): సిద్దిపేట పట్టణంలో వైద్య కళాశాల వద్ద హరితహారంలో భాగంగా నాటిన మొక్కను టాటా సుమో వాహనం ఢీ కొట్టడంతో చెట్టు పడిపోయింది. ఆ సమయంలో అక్కడే ఉన్న పోలీసులు ఈ దృశ్యాన్ని గమనించి హరితహారం అధికారి సామల్ల ఐలయ్యకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్న అధికారి వాహన దారుడు రాకేష్‌కి తొమ్మిది వేల ఐదు వందల జరిమానా విధించారు.

హరితహారంలో భాగంగా నాటిన మొక్కలకు నెలకు లక్షల రూపాయలు వెచ్చించి వాటిని కాపాడుతు న్నామని, వాటికీ ఎవరు హాని కలిగించిన జరిమానా చెల్లించాల్సిందే నని హెచ్చరించారు. మంత్రి హరీశ్ రావు ఆదేశాల మేరకు సిద్దిపేటని హరిత సిద్దిపేటగా మార్చడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్టు తెలిపారు. హరితహారం చెట్ల భద్రత విషయంలో ప్రత్యేకంగా సహకరిస్తున్న సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ శాఖ ఉన్నతాధికారులు, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లకు, మున్సిపల్ కమిషనర్, పోలీసులు, ఇతర అధికారులకు హరితహారం అధికారి సామల్ల ఐలయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# సత్వర న్యాయం కోసం ఆలోచించాలి

హైదరాబాద్, డిసెంబర్ 9:హత్య,అత్యాచార కేసుల్లో తక్షణ న్యాయం అనేది సాధ్యపడదని స్వయంగా సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ శరద్ అర్వింద్ బోబ్డే చేసిన ప్రకటన ఇప్పుడు న్యాయం కోసం ఎదురు చూస్తున్న వారికి అశనిపాతంగా చూడాలి. న్యాయానికి కూడా ఓ సమయం ఉండాలి. ఎప్పటిలోగా న్యాయం జరుగుతుందన్న దానికి కూడా స్పష్టత ఉండాలి. దిశ నిందితుల ఎన్‌కౌంటర్ నేపథ్యంలో చీఫ్ జస్టిస్ పరోక్షంగా చేసిన వ్యాఖ్యల చూస్తుంటే సామాన్యులకు చట్టంపై నమ్మకం ఉంటుందా అన్నది ఆలోచించాలి. విచారణ జరిపి నిజనిర్ధారణ జరిగిన తరువాతనే న్యాయవ్యవస్థలకు అనుగుణంగా శిక్షణలు విధించాలని చీఫ్ జస్టిస్ట్ అన్నారు. న్యాయమనేది ఇన్‌స్టెంట్‌గా జరగడం కుదరదని కూడా బోబ్డే స్పష్టం చేశారు. పగ, ప్రతీకారం తీర్చుకోవడమే న్యాయమన్న భావనకు వస్తే.. జస్టిస్ అనేది దాని స్వరూపాన్ని, అర్థాన్ని కోల్పోతుందని వ్యాఖ్యానించారు. అయితే ఇటీవల జరుగుతున్న ఘటనలతో న్యాయం వేగంగా జరగాలని, న్యాయవ్యవస్థ మారాలని పెద్ద ఎత్తున చర్చ జరుగుతోందని అన్నారు. కచ్చితంగా న్యాయ వ్యవస్థలో మార్పులు రావాలని, విచారణ ఆలస్యం తగదని, కానీ, ఇన్‌స్టెంట్ జస్టిస్ అనేది ఎప్పటికీ సాధ్యం కాదని అన్నారు. జస్టిస్ అనేది ఎప్పటికీ ప్రతీకారంగా మారకూడదని, అలా జరిగితే జస్టిస్ అనేది దాని స్వరూపాన్ని కోల్పోయినట్లే అని కూడా అన్నారు. కేసుల విచారణ వేగవంతం చేయడం గురించి మాట్లాడుతూ.. న్యాయ వ్యవస్థలో కొత్త టెక్నాలజీల అవసరం ఉందని జస్టిస్ బోబ్డే అన్నారు. ప్రజలకు న్యాయం అందుబాటులోకి వచ్చేలా ఉన్న వ్యవస్థల్ని పటిష్టం చేయాలని సీజేఐ చెప్పారు. న్యాయవ్యవస్థలో ఆలస్యం వల్ల నిరాశ, నిస్పృహతో ప్రజలకు నమ్మకం పోతుందని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ స్పష్టం చేశారు. నిజంగా దిశ కేసులో సత్వర న్యాయాన్ని ప్రజలు కోరుకున్నారు. గతంలో కేసులను చూసిన తరవాత ప్రజల్లో ఓ రకమైన అసమనం నెలకొంది. అందుకే ఎన్‌కౌంటర్ జరగ్గానే ప్రజలంతా ముక్తకంఠంతో పోలీసులు చర్యను సమర్థించారు. వారికి జేజేలు పలికారు. ఇకపోతే ఏడేళ్ల క్రి నిర్భయ కేసులో నిందితులకు విధించిన ఉరిశిక్ష అముల కాలేదు. ఇదికూడా ప్రజల్లో అసహనానికి కారణమయ్యింది. అలాగే తెలంగాణలో జరిగిన మరో రెండుమూడు కేసుల్లో జాప్యంపై ఎమ్మార్పీఎస్ నేత మందకృష్ణ మాదిగ ఆందోళనకు దిగారు. ఇక్కడ ప్రధానంగా వెనకబడి, దళితులకు సంబంధించిన కేసుల్లో ఇంత అన్యాయమా అని ఆయన ప్రశ్నించారు. ఇకపోతే యూపిలోని ఉన్నావ్ అత్యాచార బాధితురాలు కోర్టుకు వెళ్లకుండా పెట్రోల్ పోసి తగులబెట్టారు. ఇక్కడ దిశ ఆందోళన జరుగు తున్న సమయంలోనే ఈ ఘటన జరిగి దేశంలో సంచలనం కలిగించింది. దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌పై వచ్చిన స్పందనను ఈ నేపథ్యంలో అర్థం చేసుకోవాలి. యావత్తు దేశాన్ని కుదిపేసిన నిర్భయ ఉదంతంలో దోషులకు మరణశిక్ష పడి ఏడేళ్లు దాటినా ఇప్పటికీ అమలు జరగలేదు. తొమ్మిదేళ్ల పసి బాలికపై అత్యాచారం కేసులో కింద కోర్టు విధించిన మరణశిక్షను పైకోర్టు యావజ్జీవ శిక్షగా సవరించింది. అత్యా చారాలకు, హత్యలకు బలైన బిడ్డల తల్లి దండ్రులు తీరని కడుపుకోత వేదనను అనుభవిస్తుంటే, నేరస్తులు మాత్రం నిర్భయంగా సంచరిస్తున్న ఘటనలు జనంలో న్యాయస్థానాల తీర్పుపై నమ్మకాన్ని సన్నగిల్లేలా చేశాయి. ఇలా అత్యాచారాలు, హత్యలు జరుగుతూ పోతున్నా న్యాయం కోసం ప్రజలు తక్షణం ఆశించ రాదన్న రీతిలో చీఫ్‌జస్టిస్ వ్యాఖ్యలు ఉన్నాయి. మరి ప్రజలు తమకు జరిగిన న్యాయం కోసం ఎంతకాలం వేచి చూడాలి. నేరగాళ్లకు భయమెలా కలగాలి. నేరాలు జరక్కుండా ఏమి చేయాలి. అమ్మాయిల వంక చూడ కుండా ఏం చేయాలి.. వంటి ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. నిజంగా న్యాయవ్యవస్థలో మార్పులకు ప్రస్తుత తాజా పరిణామాలు భూమిక కావాలి. చీఫ్ జస్టిస్ వ్యాఖ్యలు ప్రభుత్వాల కళ్లు తెరిపించాలి. అలాగే

ప్రజలకు తక్షణ న్యాయం జరగం కోసం ఆలోచన చేయాలి. ఇప్పటికే దేశంలోని వివిధ కోర్టుల్లో దాదాపు 3 కోట్ల కేసులు పెండింగ్‌లో వున్నాయి. క్రిమినల్ కేసులే రెండు కోట్లు ఉన్నట్లు అంచనా. ఇందులో పదోవంతు కేసులు పదేళ్లకు పైగా పెండింగ్‌లో వున్నాయి. నేషనల్ క్రైమ్ రికార్డుల బ్యూరో లెక్కల ప్రకారం 2017లో 32,500 అత్యాచారం కేసులు నమోదయ్యాయి. అప్పటికే పెండింగ్‌లో వున్న వాటితో కలిపి ఈ సంఖ్య లక్షా 46 వేలకు చేరింది. వాటిలో ఆ సంవత్సరం వివిధ కోర్టుల్లో పరిష్కారమైన రేప్ కేసుల సంఖ్య 18,300 మాత్రమే. అంటే ఏటా పదిశాతం కేసులు పరిష్కారమవుతుంటే 30 శాతం కేసులు పెండింగ్ జాబితాకు అదనంగా తోడవుతున్నాయి. సంస్థాగతమైన లోపాలతో మన న్యాయవ్యవస్థ, పోలీసు వ్యవస్థ దినదినం దిగజారిపోతోంది. పెరుగుతున్న జనాభా, అందుకుతగ్గట్లుగా వివాదాల నేపథ్యంలో న్యాయస్థానాల సంఖ్య, జడ్జీల సంఖ్య పెరిగి ఉండాల్సింది. పెరగకపోగా జడ్జీ పోస్టుల్లో ఎప్పుడూ చాలా భాగం భర్తీ కాకుండా ఖాళీగానే వుంటున్నాయి. భారతదేశంలో వున్న పెండింగ్ కేసులన్నింటినీ పరిష్కరించాలంటే 70 వేలమంది అదనపు జడ్జీలు అవసర మవుతారని మూడేళ్ల కింద అప్పటి ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. పోలీసు వ్యవస్థ పరిస్థితి కూడా అదేవిధంగా వున్నది. సాధారణ స్థాయిలో నేరాలు జరిగే దేశాల్లో ప్రతి లక్ష జనాభాకు 225 మంది పోలీసులుండాలని లెక్క వుంది. నేరాలు ఎక్కువగా జరిగే భారతదేశంలో మాత్రం లక్షకు 138 మంది పోలీసులున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలకు సత్వర న్యాయంకావాలంటే ఏం చేయాలో పాలకుల ఆలోచన చేయాలి. ప్రజలకు అసమనం కలగకుండా ఏలా వ్యవహరించాలో అందుకు ఏం చేస్తే బాగుంటుందో అలా చేయాలి. అప్పుడు పోలీసులు కూడా తీర్పుచెప్పే అవకాశాలు తగ్గుతాయి.

# స్త్రీని భోగవస్తువుగా చూసినంత కాలం ఇంతే

### తాజా ఘటనల నేపథ్యంలో ఆందోళనలు
### వివక్షకు తావు లేని విధంగా ప్రవర్తించాలి
### న్యాయానికి దళితులు దూరం కాదని చెప్పాలి

హైదరాబాద్,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): స్త్రీని భోగ వస్తువుగా చూసే మనస్తత్వం ఇంకా మన సమజాం నుంచి దూరం కాలేదు. స్త్రీ ఏ కులానికి చెందినదన్నది ఇక్కడ ముఖ్యం కాదు. ఆమెను గౌరవించ గలిగే మానవత్వాన్ని సమాజం అలవర్చు కోవాలి. అప్పుడే అత్యాచార ఘటనలు ఆగ గలవు. ఇక న్యాయం విషయంలో కులమ తాలకు అతీతంగా చర్యలు ఉండాలి. అప్పుడే సమాజంలో ఇలాంటి ఆందోళనలు రావు.

దిశపై అత్యాచారం జరగడానికి మూడు రోజుల ముందు అసిఫాబాద్ జిల్లాలో ఒక ముప్పయ్యేళ్ల వివాహిత, దళిత యువతిపై కూడా గ్యాంగ్‌రేప్ జరిగింది. పరమ కిరాతకంగా ఆ యువతి చేతివేళ్లను, గొంతునూ కోసి చంపి, అడవిలో శవాన్ని పారేశారు. పోలీసులు ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. ఈ ఘటనకు మీడియాలో పెద్దగా ప్రాధాన్యత లభించలేదు. దిశ కేసులో చెప్పినట్టు, బాధిత మహిళ పేరు గోప్యంగా ఉంచాలని మీడియాకు ఈ యువతి కేసులో ఏ అధికారి సలహా ఇవ్వలేదు. ఇకపోతే దిశ ఎన్‌కౌంటర్‌తో మరోమూడు నాలుగు కేసుల్లో కూడా బాధిత కుటుంబాలు ఆందోళనకు దిగాయి. ఇక్కడ బాధితులంతా ఇతర అట్టడుగు వర్గాలకు చెందిన వారు. కులాలను బట్టి న్యాయం ఉంటుందా అని ప్రశ్నిస్తున్న వారికి ప్రభుత్వం నుంచి సమాధానం లేదు. హత్యాచారాలు, లైంగిక దాడులకు గురైన బాధితులు అగ్రకులాలకు సంబంధించిన వ్యక్తులని తెలిస్తే ఒక లాగా.. బడుగువర్గాలవారు, పేదవారని తెలిస్తే మరోలాగా న్యాయం జరుగుతోందని ఎమ్మార్పీఎస్ నేత మందకృష్ణ మాదిగ ఆ వేదన వ్యక్తం చేశారు. బాధిత మహిళా కుటుంబాల సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన తన ఆందోళనను వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలపై హత్యలు, హత్యాచారాలు జరుగుతున్నా బాధిత కుటుంబాలకు న్యాయం జరగడంలేదని, ఈ ఘటనలపై ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని మందకృష్ణమాదిగ డిమాండ్ చేశారు. గత నెల 24న ఆసిఫాబాద్ జిల్లాలో ఓ మహిళ పై సామూహిక హత్యాచారం చేశారు. అదేనెల 27న వరంగల్‌లో ఓ అమ్మాయిని ప్రేమించిన వాడే హత్యాచారం చేశాడు. అదే రోజు చటాన్‌పల్లిలో దిశపై దారుణంగా హత్యాచారం చేశారు. పై రెండు ఘటనల్లో నిందితులకు బాధితురాళ్లది ఏ కులమో తెలుసని, దిశ కేసులో మాత్రం నిందితులకు ఆమె కులం పేరు తెలియదని మందకృష్ణ మాదిగ చెప్పారు. ఇటువంటి పరిస్థితుల్లో దిశ ఉదంతం దేశం దృష్టిని తనవైపు తిప్పుకున్నది. హైదరాబాద్ నగరం శివారు ప్రాంతంలో, దేశంలోనే అతిపెద్ద జాతీయ రహ దారి పక్కన, నిత్యం వేలాది వాహనాలు తిరిగే ఔటర్ రింగ్‌రోడ్డుకు చేరువలో ఒక యువ డాక్టర్‌పై జరిగిన దారుణ ఘటన మీడియాలో విస్తృతంగా ప్రచార మైంది. నాకు భయమేస్తున్నది పాప అన్న దిశ గొంతుక ప్రతి గుండెను తాకింది. ప్రభుత్వంపై, పోలీసులపై ఒత్తిడి పెంచింది. పోలీసులే తీర్పు చెప్పేసి శిక్షలు వేస్తూ పోతే ఇక న్యాయవ్యవస్థ దేనికి? కోర్టులు ? జడ్జీలు ఎందుకు? అంటూ అక్కడక్కడా కొన్ని స్వరాలు వినిపించాయి. కానీ మెజారిటీ ప్రజలు మాత్రం పోలీసు తీర్పునే సమర్థించారు. ఇదే విషయాన్ని మందకృష్ణ మాటల్లో కూడా స్ఫురించింది. ఈ కారణాలు కూడా నేర పరిశోధనకు సవాల్ విసురుతున్నాయి. అనేక కేసుల్లో నేర నిరూపణలో వైఫల్యాలకు ఇవి కూడా కారణాలుగా చూడాలి. మా మాన ప్రాణాలకు విలువ లేదా అని ప్రశ్నిస్తూ దళిత సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్ అత్యాచార ఘటనలో నిందితులు బడాబాబులు. ఘోరం జరిగి సరిగ్గా ఏడాది నిండగానే ఆ బాధితురాలిని బడాబాబులు నడిరోడ్డుపై నిప్పుపెట్టి చంపేశారు. ఇక్కడ నిందితుల ఎన్‌కౌంటర్ జరిగిన రోజే అక్కడ బాధితురాలి హత్య జరగడం కేవలం యాదృచ్ఛికమే కావచ్చు. ఆడపిల్లల మీద అత్యాచార ఘటనలను సంపూర్ణంగా అరికట్టాలంటే చేపట్టవలసిన చర్యలు ఆలోచించాలనే డిమాండ్ ఉంది. ఇటువంటి సంఘటనలు జరిగి నప్పుడు అందరూ చెబుతున్నట్టు విచ్చలవిడి మద్యం విక్రయాలపై నియంత్రణ విధించాలన్న డిమాండ్ కూడా వచ్చింది. మొబైల్ ఫోన్లలో అశ్లీల వరద ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ ఉంది. బీహార్ సిఎం నితీశ్ కుమార్ స్వయంగా దీనిని అంగీకరించారు. అభ్యుదయ వాదులమని చెప్పుకునే వాళ్లు కూడా స్త్రీలపట్ల కొంత నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తూనే ఉన్నారు.

# మరింత ఆందోళనకరంగా దేశంలో ఆర్థిక పరిస్థితులు

### ఆర్థికరంగంపై రఘురామ రాజన్ హెచ్చరికలు
### ఆయన సూచనలపై అప్రమత్తం కావాల్సిన సమయం

న్యూఢిల్లీ,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ వరుసగా చేస్తున్న హెచ్చరికలకు, దేశంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులకు పోలికలు ఉన్నాయి. దేశంలో ఉల్లిగడ్డల ధరల పెరుగుదల ఒక్కటే కాకుండా పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం ఆందోళన కలిగిసున్నాయి. దీనికితోడు నిత్యావసరాలు ప్రజలకు అందుబాటులో లేకుండా పరుగులు పెడుతున్నాయి. అంబానీలు, ఆదానీలు కోట్లకు ఎగబాకుతున్న ప్రస్తుత తరుణంలో సామాన్యులు మాత్రం పూట తిండి కోసం వెంపర్లాడుతున్నారు. దేశ అర్థిక వ్యవస్థ కునారిల్లుతున్నా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మాత్రం దిద్దబుట చర్యలకు ఉపక్రమించడం లేదు. రియల్ ఎస్టేట్, కన్‌స్ట్రక్షన్ రంగాలు టైంబాంబ్‌లా మారాయని, అవి ఎప్పుడు కుప్పకూలుతాయో తెలియదని రఘురామ రాజన్ బాంబులు పేల్చారు. ఎకానమీపై సరైన నిర్ణయాలు తీసుకోవడం లేదంటూ కేంద్ర ప్రభుత్వం తీరును వేలెత్తిచూపారు. మోడీ సర్కారు విధానాలు సరిగ్గా లేవని కుండబద్దలు కొట్టారు. ఇండియా ఎకానమీ నీరసించి పోతున్నదని, మందగమనం నడిమధ్యలో ఉందని హెచ్చరించారు. అధికారం అంతా ప్రధానమంత్రి ఆఫీసులో ఉండటం, మంత్రులకు అధికారాలు లేకపోవడం వల్ల ఈ దుస్థితి ఏర్పడిందంటూ ఇండియా టుడే పత్రికలో వ్యాసం రాశారు. నిజానికి ఆయన సూచనలు ఇప్పుడు హెచ్చరికలు కావాలి. మందగమనంపై దృష్టి సారించాలి. జిడిపి 5శాతం కూడా లేదన్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. భూమి, పెట్టుబడి, కార్మికశక్తి సులువగా దొరికేలా మార్పులు తీసుకుంవాలి. ఇన్వెస్ట్‌మెంట్లు పెరిగేలా నిర్ణయాలు ఉండాలి. మంత్రులు నిస్సహాయులుగా మిగిలిపోవడం, స్పష్టమైన దూరదృష్టి లేకపోవడం, వేరే అంశాలపై దృష్టి పెట్టడం వల్ల ఎకానమీ బలహీనమవుతుంది. ప్రధానమంత్రి కార్యాలయం మరింత దృష్టి సారిస్తేనే ఆర్థిక సంస్కరణలు ఊపందుకుంటాయని రఘురామ్ రాజన్ వివరించారు. పోటీతత్వాన్ని, సామర్థ్యాన్ని పెంచుకోవడానికి ఇండియా వెంటనే ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్లను కుదుర్చుకోవాలన్నారు. ఆర్థిక సంస్కరణల విషయంలో కేవలం కొందరు వ్యక్తులు నిర్ణయాలు తీసుకోవడం సరికాదు. రాష్ట్రస్థాయి ఆర్థిక వ్యవహారాల గురించి మాత్రమే వీరికి అవగాహన ఉంటుంది. జాతీయస్థాయిలో ఆర్థిక వ్యవస్థ ఎలా పనిచేస్తుందో తెలియదు. స్పష్టమైన ఎజెండా కూడా లేదు. ఇది వరకటి పార్టీలు కూడా కూటమి ప్రభుత్వాలను నడిపినప్పటికీ, ఎకానమీని సరళీకరించడానికి కృషి చేశాయి. అధికారం అంతా ఒక్కచోటే కేంద్రీకృతంకావడం కూడా దీనికి కారణమని నిర్మొహమాటంగా చెప్పారు. సమస్యను పూర్తిగా అర్థం చేసుకుంటే, మోడీ ప్రభుత్వం ఎకానమీ మందగమనం సమస్యను పరిష్కరించవచ్చన్నారు. అంటే సమస్యను అర్థం చేసుకోవడం లేదని ఆయన హెచ్చరించారు. జీడీపీ సెప్టెంబరు క్వార్టర్‌లో ఆరేళ్ల కనిష్టం 4.5 శాతానికి పడిపోవడం, ద్రవ్యోల్బణం, వినిమయం తగ్గిన నేపథ్యంలో ఆయన ఈ అంశాలను లేవనెత్తారు. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాలు ఎప్పుడైనా కుప్పకూలే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

ఆర్థిక సంస్కరణల విషయంలో అందరి అభిప్రాయాలు స్వీకరించాలి. ఆర్థికవేత్తల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ముక్కుసూటిగా చెప్పారు. దివాలా కేసులను త్వరగా పరిష్కరించాలన్నారు. ఈ సూచనలు ప్రభుత్వం కొంతమేరకైనా అంగీకరించాలి. అప్పుడే కొంతయినా మేలు కలగవచ్చు. లేదా ఆర్థికవేత్తలతో చర్చించి సమస్యనుదారికి తెచ్చే ప్రయత్నం చేయాలి.

## ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా తెలంగాణ

### -అభివృద్ధి జీర్ణించుకోలేకే విమర్శలు: ఎమ్మెల్యే

వరంగల్,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ వెనుకబాటు, వివక్షతకు గురైందని, స్వరాష్ట్రం సాధించుకున్నాకనే సిఎం కెసిఆర్ నాయకత్వంలో తెలంగాణను అగ్రరాష్ట్రంగా తీర్చిదిద్దేలా కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ చెప్పారు. దీనిని జీర్ణించుకోలేని కాంగ్రెస్,టిడిపిల నేతలు విమర్శలు చేస్తున్నారని అన్నారు. దేశమంతా తెలంగాణ వైపు చూస్తుందని, మిగతా రాష్ట్రాల సీఎం లంతా సీఎం కేసీఆర్ పాలనను క్షుణ్ణంగా అధ్యయనం చేస్తున్నారని తెలిపారు. వివిధ రాష్ట్రాల మంత్రుల బృందాలు తెలంగాణ పర్యటించడమే అందుకు ఉదాహరణ అని అన్నారు. మిషన్ కాకతీయ చరిత్రకు గీటురాయి అని ,మిషన్ భగీరథ నూతన చరిత్ర అని అభివర్ణించారు. పదేళ్లపాటు పాలన చేసిన వారు చేయని పనులను రెండేళ్లలో సిఎం కెసిఆర్ చేసి చూపారని అన్నారు. విద్య, వైద్యం, పరిపాలన, సంక్షేమ పథకాల తీరు మరే రాష్ట్రంలో లేని విధంగా అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే వివరించారు. నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలు లబ్ధిపొందే విధంగా సంక్షేమ కార్యక్రమాలు తెలంగాణ రాష్ట్రంలో అమలవు తున్నాయన్నారు. ఆదివాసీలు ఉమ్మడి రాష్ట్రంలో అన్ని విధాలుగా నష్ట పోయారని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక అభివృద్ధికి నోచుకుంటున్నారని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతాలు మొన్నటి వరకు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత తొవలన్ని రహదారుగా ఏర్పడుతు న్నాయన్నారు. ప్రతి మారుమూల పల్లెకు కూడా రహదారులు నిర్మిస్తున్నామని తెలిపారు. అన్ని రాష్ట్రాలు తెలంగాణ వైపు చూస్తున్నాయని, సంక్షేమ పథకాల పట్ల ఆరా తీస్తున్నాయన్నారు. ఓ పక్క ఉనికి కోసం విమర్శలు చేస్తున్నా కేసీఆర్ పని తీరుపట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఎన్ని కుట్రలు, అంబండాలు ప్రభుత్వంపై మోపినా ప్రజల మద్దతు కేసీ ఆర్‌కే ఉంటుందని అన్నారు. తెలంగాణలో విపక్షాల అడ్రస్ గల్లంతేనని తెలిపారు. ప్రజల్లో ఉనికి కోసం విపక్షాలు అర్థంలేని ఆరోపణలు చేస్తున్నాయని దుయ్యబట్టారు.

## మిషన్ భగీరథతో గిరిజన పల్లెలకు శుద్దజలం

భద్రాద్రి కొత్తగూడెం,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్రం ఏర్పడి సీఎం కేసీఆర్ ప్రభుత్వం కొలువు తీరిన తరువాత ప్రతి ఆదివాసీ పల్లె స్వచ్ఛమైన నీరు అందుకుంటుందని జడ్పీ ఛైర్మన్ కోరం కనకయ్య అన్నారు. ఇది వరకు ఏజెన్సీ పల్లెలు కలుషిత నీటిపైనే ఆధారపడాల్సి వచ్చేదని అన్నారు. వాగులు, వంకలు, చెలమిల మీదనే మారుమూల గ్రామాలు ఆధారపడ్డాయని అన్నారు. త్వరలో ప్రజల ముందుకు రానున్న మిషన్ భగీరథతో ప్రజల కష్టాలన్ని తొలగిపోతాయని అన్నారు. ఏజెన్సీలో నీటి తండ్లాట ఉండబోదని అన్నారు. ఒకప్పుడూ విద్యనభ్యసించాలన్న, వైద్యం చెయించుకోవాలన్నా మైళ్ళ దూరం నడవాల్సి వచ్చేదని అన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా సీఎం కేసీఆర్ అన్ని రకాలుగా అభివృద్ధి చేశారని తెలిపారు. విద్య వ్యవస్థ ఏజెన్సీలో పూర్తిగా వెనుకబాటుకు గురైందని, నేడు ఆ సమస్యను అధిగమించామని తెలిపారు. వైద్యం కోసం మైళ్ళ దూరం నడవాల్సిన పరిస్థితి వచ్చిందని, రహదారుల ఏర్పాటుతో సునాయాసంగా నియోజకవర్గ కేంద్రానికి చేరుకునేలా ప్రభుత్వం కల్పించిందని అన్నారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రభుత్వ పని తీరు బ్రహ్మాండంగా ఉందని, అభివృద్ధి కార్యక్రమాలు రోజురోజుకు ముందుకు సాగుతున్నాయని అన్నారు. ఇలాంటి పరిపాలనతో సీఎం కేసీఆర్ చరిత్ర పుటల్లో నిల్వనున్నారని అభివర్ణించారు. విపక్షాలు కేవలం ఉనికి కోసమే విమర్శలు చేస్తున్నాయని అన్నారు.

## టెన్త్‌లో ఉత్తమ ఫలితాలకు కృషి చేయాలి

ఖమ్మం,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తున్నదని జిల్లా పరిషత్ చైర్మన్ కమల్ రాజు చెప్పారు. కేజీ టూ పీజీ ప్రవేశపెట్టేందుకు దశలవారీగా గురుకుల పాఠశాలలను మంజూరు చేస్తుందని చెప్పారు. ఈ దశలో అధికారులు, ఉపాధ్యాయులు కృషి చేసి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని అన్నారు. పదో తరగతిలో నూరుశాతం ఫలితాలు సాధించాలని, ఎవరూ కూడా ఫెయిల్ కావొద్దని పేర్కొన్నారు. గతేడాది పదిలో సాధించిన ఉత్తీర్ణతా శాతం వివరాలు తీసుకుని మరింతగా ఫలితాలు రాబట్టాలని అన్నారు. అవసరమైతే పదోతరగతి విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. ఆందోళన లేకుండా పది పరీక్షలు రాసేలా చేయాలని, అందుకు అవసరమైన శిక్షణ విద్యార్థులకు ఇవ్వాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు సలహాలు అందజేశారు.

## ఈ- మార్కెటింగ్‌దే పైచేయి

ఖమ్మం,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): భవిష్యత్తులో ఈ-మార్కెటింగ్ వ్యవస్థ అభివృద్ధి చెందనున్నందున దీని ద్వారా రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని జిల్లా పౌరసరఫరాల అధికారులు అన్నారు. నగదురహిత లావాదేవీలు, ఇ- మార్కెటింగ్ కీలక భూమిక పోషిస్తాయని అన్నారు. ప్రైవేట్ రైస్ మిల్లుల నుంచి ప్రభుత్వానికి వచ్చే బియ్యాన్ని స్టాక్ పెట్టేందుకు జిల్లాలో బూర్గంపహాడ్, కొత్తగూడెం, దమ్మపేటలలో ఎస్‌డబ్ల్యూసీ స్టాక్ పాయింట్లను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. అదే విధంగా రైతులు తమ పంటల విక్రయాలను మార్కెటింగ్ వ్యవస్థ ద్వారా జరపాలని సూచించారు. జిల్లాలోని రైతుల శ్రేయస్సు కోసం కృషిచేస్తామని అన్నారు.

## తెరాస వైఫల్యాలను ఎండగడతాం

### -హామీలపై నోరుమెదపని నేతలు

నిజామాబాద్,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): తెలంగాణ ఏర్పడ్డ తరవాత అధికారంలోకి వచ్చిన ఐదేళ్ల పాలనలో తెరాస పూర్తిగా వైఫల్యం చెందిందని డిసిసి అధ్యక్షుడు తాహిర్ బిన్ హుదాన్ విమర్శించారు. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని అన్నారు. అవినీతి, అహంకారానికి తెరాస ట్రేడ్‌మార్క్‌గా మారిపోయిందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి చేయకుండానే గోబెల్స్ ప్రచారంతో ప్రజలను మభ్య పెడుతోందని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు కాంగ్రెస్ ప్రజలను చైతన్యం చేస్తోందని తెలిపారు. ఉద్యోగాలు రాని నిరుద్యోగులు, గిట్టుబాటు ధర దక్కక ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతుల కడగళ్లు చూస్తే నిజాలు తెలుస్తాయని చెప్పారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడతామని అన్నారు. కేసీఆర్ పాలన నియంతృత్వం ట్రేడ్‌మార్క్‌లా మారిందని ధ్వజమెత్తారు. రైతు ఆత్మహత్యలకు గత ప్రభుత్వాలే కారణమని నిస్సిగ్గుగా ప్రభుత్వ పెద్దలు మాట్లాడుతున్నారని, ఇటీవల జరిగిన రైతుల ఆత్మహత్యలు మీ పాలనలో కాదా ఆయన సూటిగా ప్రశ్నించారు. రైతుల ఆత్మహత్యల్లో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే రెండోస్థానంలో ఉందని మండిపడ్డారు. బీజేపీ తమవి గొప్ప సిద్ధాంతాలంటూ ప్రతి ఇల్లు తిరుగుతూ కాంగ్రెస్ నేతలను ప్రలోభపెడుతుందన్నారు. ఎవరు ఏ పార్టీలో చేరడం లేదని... కాంగ్రెస్ పార్టీలో చేరతామంటూ బీజేపీ సీనియర్లే తమను సంప్రదిస్తున్నారని అన్నారు.

# బల్దియాకు పెరిగిన ఆన్‌లైన్ చెల్లింపులు

## చెత్త తరలింపులో పెరుగుతున్న చైతన్యం

హైదరాబాద్,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): ఆన్‌లైన్‌లో జీహెచ్ఎంసి ఆస్తిపన్ను, ట్రేడ్‌లైసెన్స్ ఫీజులను చెల్లించే వెసులుబాటు రావడంతో ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేసేవారి సంఖ్య గణనీయంగా పెరిగింది. మీ-సేవా, ఆన్‌లైన్, సిటీజన్ సర్వీస్ సెంటర్స్, బిల్‌కలెక్టర్ల ద్వారా చెల్లించేందుకు అత్యధికులు ముందుకు వస్తున్నారు. నగరంలో క్యాష్‌లెస్ లావాదేవీలను ప్రారంభించడంలో భాగంగా ఆన్‌లైన్ చెల్లింపులను చేపట్టేందుకు జీహెచ్ఎంసి ప్రకటించిన విషయం విదితమే. అదేవిధంగా ట్రేడ్‌లైసెన్స్ ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేసే వెసులుబాటు కల్పించినట్లు కమిషనర్ తెలిపారు. నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లో జారీ చేస్తున్నందుకు గతంలోనే జీహెచ్ఎంసీకి 2017 స్కోచ్ మెరిట్ అవార్డు ప్రకటించింది.

దేశంలోని ఇతర నగరాల్లో ఆన్‌లైన్ ద్వారా భవన నిర్మాణ అనుమతుల విధానం అమలుకు దాదాపు రెండేళ్ల సమయం పట్టగా జీహెచ్ఎంసీలో మాత్రం కేవలం మూడు నెలల్లోనే పూర్తిస్థాయిలో అమలు చేశారు. పుణె కార్పొరేషన్‌లో భవన నిర్మాణ అనుమతులను ఆన్‌లైన్‌తో పాటు మ్యాన్‌వల్ నిబంధనలోనూ జారీ చేస్తుండగా జీహెచ్ఎంసీలో మాత్రం 100శాతం ఆన్‌లైన్ ద్వారా డిజిటల్ సంతకంతో కూడిన అనుమతులు జారీ చేస్తున్నారు. ఆన్‌లైన్ విధానం వల్ల టౌన్‌ప్లానింగ్ అధికారుల్లో జవాబుదారితనంతో పాటు పారదర్శకత ఏర్పడింది. భవన నిర్మాణ అనుమతులు, ఆక్యూపెన్సీ సర్టిఫికెట్ల జారీని ఆన్‌లైన్ ద్వారా అందజేయడం ద్వారా జవాబుదారితనం పారదర్శతను సాధించింది. నగరంలో మొత్తం రెండువేల ఆటోలు చెత్తను సేకరిస్తుండగా వీటిలో రాజేంద్రనగర్, ముషీరాబాద్, మల్కాజ్‌గిరి తదితర సర్కిళ్లలో 90శాతానికిపైగా స్వచ్ఛ ఆటోలద్వారా తడి, పొడి చెత్తను వేరువేరుగా చేసి ట్రాన్స్‌ఫర్ స్టేషన్లకు పంపిస్తున్నారు. రాజేంద్ర నగర్ సర్కిల్‌లో అత్యధికంగా 98.27 శాతం చెత్తను వేరువేరుచేసి తరలిస్తుండగా, హయత్‌నగర్, సరూర్ నగర్, మెహిదీపట్నం సర్కిళ్లలో అతితక్కువ మొత్తంలో చెత్తను వేరువేరుగా చేస్తున్నారు.

వీటితోపాటు ప్రతి ట్రాన్స్‌ఫర్ స్టేషన్ వద్ద తడి, పొడి చెత్తను వేరువేరుగా తెచ్చే వాహనాల సంఖ్యను పేర్కొనే బోర్డు, ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో తడి, పొడి చెత్తను వేరువేరుగా చేసే ప్రాంతాలవద్ద బోర్డులను విధిగా ప్రదర్శించాలని స్పష్టంచేశారు. చెత్తలో 75శాతం తిరిగి ఉపయోగ పడుతుందన్న అంశాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రతి స్వచ్ఛ ఆటో పూర్తిస్థాయిలో పనిచేసే అంశంపై సమీక్షించాలని సుదీర్ఘకాలంగా ఆటోలు నడపని డ్రైవర్లనుంచి ఆటోలను స్వాధీనపర్చుకోవాలని కమిషనర్ తెలిపారు. స్వచ్ఛ హైదరాబాద్‌లో భాగంగా నగరంలో చెత్త తరలింపునకు ప్రవేశపెట్టిన రెండువేల ఆటోటిప్పర్ల ద్వారా నూరు శాతం తడి, పొడి చెత్తగా వేరుచేసి ట్రాన్స్‌ఫర్ స్టేషన్లకు తరలించే వక్రియపై జీహెచ్ఎంసీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ఇప్పటికే ఇంటింటి నుంచి తడి, పొడి చెత్తను వేరుచేసి స్వచ్ఛ ఆటోలకు అందించడానికి 44లక్షల డస్ట్‌బిన్‌లను పంపిణీచేశారు. అయిన ప్పటికీ ఇంటివద్దే తడి, పొడి చెత్తను వేరుచేయకుండా కలిపి స్వచ్ఛ ఆటోలకు ఇస్తున్నారు. దీంతో ఆటోస్థాయిలోనే చెత్తను తడి, పొడి చెత్తగా వేరుచేసి తరలించాలని ఆటో డ్రైవర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. దీంతో చెత్త ద్వారా వచ్చే ప్లాస్టిక్, ఇనుము తదితర లోహాలను వేరుచేసి విక్రయించడం ద్వారా స్వచ్ఛ ఆటో డ్రైవర్లు అదనపు ఆదాయం పొందుతున్నారు. వీటితోపాటు ఆటోలలో ఏర్పాటుచేసిన పార్టీషన్లలో తడి చెత్తను, పొడి చెత్తను వేరువేరుగా సేకరించి తరలిస్తున్నారు.

## శ్రీరంగం శ్రీరంగనాథస్వామివారికి పట్టువస్త్రాల సమర్పణ

తిరుమల,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): తమిళనాడు రాష్ట్రంలో ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన శ్రీరంగంలోని శ్రీ రంగనాథ స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆదివారం టిటిడి ధరకర్తల మండలి అధ్యక్షులు వైవి.సుబ్బారెడ్డి, కార్యనిర్వహణాధికారి అనిల్‌కుమార్ సింఘాల్ కలిసి వీటిని సమర్పించారు. ముందుగా ఆలయం వద్దకు చేరుకున్న టిటిడి ఛైర్మన్, ఈవోకు శ్రీరంగం ఆలయ ఛైర్మన్ శ్రీ వేణు శ్రీనివాసన్, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఛైర్మన్, ఈవో పట్టువస్త్రాలను తలపై పెట్టుకుని ఊరేగింపుగా వెళ్లి స్వామివారికి సమర్పించారు. దర్శనానంతరం ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలను టిటిడి ఛైర్మన్‌కు, ఈవోకు అందజేశారు. కైశిక ఏకాదశిని పురస్కరించుకుని 2006వ సంవత్సరం నుంచి శ్రీరంగం ఆలయానికి టిటిడి పట్టువస్త్రాలు సమర్పిస్తోంది. ప్రాచీన శ్రీవైష్ణవాలయాలతో ఆధ్యాత్మిక సంబంధాలను కొనసాగించేందుకు టిటిడి పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది.

## పోటులో జరిగింది స్వల్ప అగ్నిప్రమాదమే..

### -డెప్యూటీ ఈఓ హరీంద్రనాథ్ వివరణ

తిరుమల,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): శ్రీవారి ఆలయం వెలుపల గల అదనపు బూందీ పోటులో ఆదివారం జరిగింది స్వల్ప అగ్నిప్రమాదమేనని, ఎలాంటి ఆస్తినష్టం జరగలేదని శ్రీవారి ఆలయ డెప్యూటీ ఈఓ హరీంద్రనాథ్ వివరణ ఇచ్చారు. బూందీ తయారీ క్రమంలో పోటు కార్మికుడు బాణలిలో నెయ్యి నింపుతుండగా పొరపాటున నెయ్యి డబ్బా జారి పొయ్యి పై పడడంతో మంటలు అంటుకున్నాయి. స్వల్పంగా చెలరేగిన మంటలు బ్లోయర్ ద్వారా బయటకు వ్యాపించాయి. దట్టమైన పొగ వెలువడింది. అక్కడున్న సాంకేతిక సిబ్బంది సత్వరం స్పందించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. దీనివల్ల ఎవరికీ ఎలాంటి అపాయం గానీ, ఆస్తి నష్టం గానీ జరగలేదు. కారణంగా పోటును శుభ్రం చేయాల్సి రావడం వల్ల 20 పొయ్యిలను తయారీకి దూరంగా ఉంచడం జరిగింది. అరగంటలో పోటును శుభ్రం చేసి బూందీ తయారీ పక్రియను యథావిధిగా కొనసాగించడం జరుగుతోంది.

## మహిళల రక్షణ, సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### -హోంమంత్రి సుచరిత

అమరావతి,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): అసెంబ్లీలో మహిళల భద్రతపై స్వల్పకాలిక చర్చలో హోం మంత్రి మేకతోటి సుచరిత మాట్లాడుతూ.. మహిళల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో మహిళా కానిస్టేబుళ్లను నియమించామని.. శాంతి భద్రతలను నివారించడంలో సహాయపడతారని మంత్రి స్పష్టం చేశారు. మహిళల రక్షణ, సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆత్మహత్యలు, ఒత్తిడి నిర్వహణ అంశాలపై కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరీ ముఖ్యంగా మిస్సింగ్ కేసులు, బాల్య వివాహాల నియంత్రణపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని అసెంబ్లీ వేదికగా మంత్రి చెప్పుకొచ్చారు. అంతేకాకుండా మహిళల రక్షణకోసం 'మహిళా మిత్రభాగం' కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మహిళల రక్షణకు ఎపి రోల్ మోడల్‌గా ఉండాలని వైసీపీ ఎమ్మెల్యే రోజా అన్నారు. సిఎం జగన్ కూడా ఇద్దరు ఆడపిల్లల తండ్రి అన్నారు. అంతకుముందుక జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై వైసీపీ ఎమ్మెల్యే రోజా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే వారికి రెండు బెత్తం దెబ్బలు వేయాలంటూ పవన్ చేసిన వ్యాఖ్యలను ఖండిచారు. చరిత్రలో రెండు చోట్ల ఓడిపోయిన ఏకైక నాయకుడు అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రేప్ చేస్తే రెండు బెత్తం దెబ్బలు వేయాలన్న వ్యక్తి.. గన్ పట్టుకుని వీధుల్లోకి ఎందుకు వచ్చాడని ప్రశ్నించారు. తన అక్కను ఏదో అన్నారని చంపేద్దామనుకున్నానని ఇంటర్వ్యూలో పవన్ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే స్పీకర్ తమ్మినేని కల్పించుకొని.. సభలో లేని వ్యక్తుల గురించి మాట్లాడొద్దని సూచించారు. దీంతో తన మాటలను ఉపసంహరించుకున్న ఆమె.. జనసేన ఎమ్మెల్యే ద్వారా ఆయనకు తెలుపుతున్నానన్నారు.

## ఈనెల 17వరకు అసెంబ్లీ సమావేశాలు

### - 15రోజులు నిర్వహించాలని పట్టుబట్టిన విపక్షం
### - అచ్చెన్నాయుడు, సీఎం జగన్ మధ్య ఆసక్తికర చర్చ

అమరావతి, డిసెంబర్9(ఆర్ఎన్ఎ) : అసెంబ్లీ సమావేశాలు ఈనెల 17వ తేదీ వరకు సాగనున్నాయి. స్పీకర్ తమ్మినేని సీతారాం అధ్యక్షతన బీజేసీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి, మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, కురసాల కన్నబాబు, అనిల్ కుమార్ యాదవ్, చీఫ్ విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి, శాసనసభ ఉపప్రతిపక్షనేత అచ్చంనాయుడు హాజరయ్యారు. తొమ్మిది రోజుల పాటు సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తుండగా.. కనీసం 15రోజులు సభ నిర్వహించాలని విపక్షం పట్టు పట్టింది. ఈ క్రమంలో సుమారు అరగంటకు పైగా జరిగిన బీఏసీ సమావేశంలో ఓ నిర్ణయానికొచ్చారు. మొత్తం ఏడు పని దినాలు సభ నిర్వహించాలని బీఏసీ సమావేశంలో సభ్యులు నిర్ణయించారు. కాగా ఈనెల 9,10,11,12,13,16,17 తేదీల్లో అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. శని, ఆది రెండ్రోజులూ అసెంబ్లీకి సెలవు ప్రకటించారు. ఈ సమావేశాల్లో పలు అంశాలపై చర్చించేందుకు స్పీకర్ నిర్ణయించారు. మరోవైపు సభలో రెడ్‌లైన్ ఏర్పాటు చేస్తారని ప్రచారం సాగింది. రెడ్‌లైన్ పెట్టడం ద్వారా ఆ గీత దాటి స్పీకర్ పోడియం వైపుకు ఎరువు దూసుకొచ్చిన వారిని సభ నుంచి సస్పెండ్ చేసేలా ఓ నియమాన్ని పెట్టాలని భావించారు. కానీ సమావేశంలో ఆ అంశంపై చర్చకు రాలేదని తెలుస్తోంది. మరోవైపు బీఏసీ సమావేశంలో ఆసక్తికర చర్చ జరిగింది. బీఏసీ సమావేశానికి ప్రతిపక్షం నుంచి తెలుగుదేశం పార్టీ శాసనసభాపక్ష ఉపనేత అచ్చెన్నాయడికి ఇటీవల జరిగిన కారు ప్రమాదంపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బీఏసీలో ఆరా తీశారు. ప్రమాదం గురించి అచ్చెన్నను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును సీఎంకు అచ్చెన్నాయుడు వివరించారు. తనకు స్వల్ప గాయాలు అయ్యాయని, ఇప్పుడు ఫర్వాలేదని అచ్చెన్నాయుడు చెప్పారు. మా సీఎంకు మీపై ఎంతప్రేమ ఉందో చూడండని అచ్చెన్నను ఉద్దేశించి చీఫ్ విప్ శ్రీకాంత్‌రెడ్డి వ్యాఖ్యానించగా.. నాకు మాత్రం సీఎం అంటే కోపమా?.. ఆయనకు, నాకు వ్యక్తిగతంగా ఏమీ లేదు. మాది వేరే పార్టీ, మీది వేరే పార్టీ. అంత వరకే విభేదం అని అచ్చెన్నాయుడు జవాబిచ్చారు.

## ఉల్లి ధరలపై సీఎం సమీక్షిస్తున్నారు

### - వైసీపీ ఎమ్మెల్యే ధర్మశ్రీ

అమరావతి, డిసెంబర్9(ఆర్ఎన్ఎ) : దేశవ్యాప్తంగా ఉల్లిధరలు ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్నా, జగన్ ప్రభుత్వం సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుందని ఎమ్మెల్యే ధర్మశ్రీ చెప్పారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. కిలో ఉల్లిని రూ. 25కే రైతు బజార్ల ద్వారా ప్రజలకు అందిస్తున్నామని చెప్పారు. ఉల్లి ధరలపై ఎప్పటి కప్పుడు సీఎం జగన్ పర్యవేక్షణ చేస్తున్నారన్నారు. పోలవరం, అల్వార్, కర్నూలు నుంచి ఉల్లిని దిగుమతి చేసుకుంటున్నామని, ప్రభుత్వం కిలో ఉల్లిపై రూ.100 భారం భరిస్తుందని ఆయన తెలిపారు. రూ. 25 కోట్లతో 35 క్వింటాళ్ల వరకు ఇప్పటి వరకు సరఫరా చేసినట్లు చెప్పారు. హెరిటేజ్‌లో ఉల్లి ధరలు 135 రూపాయలు ఉందని, ప్రజలపై చంద్రబాబుకు అంత ప్రేమముంటే రూ. 25 రూపాయిలకే ఇవ్వొచ్చు కదా అని అన్నారు. ఉల్లిధరలే కాదు హెరిటేజ్‌లో నిత్యవసర ధరలు భారీగానే వున్నాయని ఎమ్మెల్యే ధర్మశ్రీ విమర్శించారు.

## ఏపీలో జనవరిలో మెగా డీఎస్సీ..

### - అసెంబ్లీలో ప్రకటించిన మంత్రి సురేష్

అమరావతి, డిసెంబర్9(ఆర్ఎన్ఎ) : ఏపీలో నిరుద్యోగులకు జగన్ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. మెగా డీఎస్సీ నిర్వహిస్తామని మంత్రి ఆదిమూలపు సురేష్ ప్రకటించారు. వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. రాష్ట్రంలో 7900పోస్టులతో డీఎస్సీ ఉంటుందని తెలిపారు. ఈ మెగా డీఎస్సీ వచ్చే నెలలో (జనవరి 2020) నిర్వహిస్తామంటున్నారు. మెగా డీఎస్సీపై మంత్రి ప్రకటనతో నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్ కూడా ప్రతి ఏటా జనవరిలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. రాబోయే రోజుల్లో వివిధ శాఖల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ పక్రియ చేపడతామని.. వచ్చే జనవరిలో నోటిఫికేషన్ ఇస్తామని తెలిపారు. ఒక్క ప్రభుత్వ ఉద్యోగం కూడా ఖాళీగా ఉంచే ప్రసక్తే లేదని.. జనవరి నెల సమీపిస్తున్నందున నిరుద్యోగులంతా సిద్ధంగా ఉండాలన్నారు. ఇప్పుడు చెప్పినట్లుగానే మెగా డీఎస్సీకి సిద్ధమవుతున్నారు. ఇటు జగన్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత వరుసగా ఉద్యోగాల భర్తీ చేపడుతోంది. గ్రామవాలంటీర్, వార్డ్ వాలంటీర్, గ్రామ సచివాలయ ఉద్యోగాలతో పాటు అంగన్‌వాడీ, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలను భర్తీ చేస్తోంది.

# రూ.25కే ఉల్లిని అందిస్తున్నాం

### - ఎక్కడ ఉల్లి దొరికితే అక్కడ కొనుగోళ్లు చేస్తున్నాం
### - హెరిటేజ్‌లో రూ. 200కు విక్రయిస్తున్నారు
### - మళ్లీ అసెంబ్లీలో చంద్రబాబు ఉల్లిపై చర్చఅంటాడు
### - మీరు చేసే పనులకు న్యాయం, ధర్మం ఉందా?
### - అసెంబ్లీలో ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి

అమరావతి,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): ఉల్లి కొరత దేశవ్యాప్తంగా ఉందని, ఏపీలోనూ ఉల్లికొరతతో సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి ఇబ్బందులను తొలగించేందుకు ప్రభుత్వం రైతు బజార్లలో కిలో ఉల్లి రూ. 25కే సబ్సిడీపై అందిస్తుందని ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో ఏపీలో ఉల్లిపాయల కొరతపై చర్చించాలని కోరుతూ టీడీపీ వాయిదా తీర్మానం ఇచ్చింది. అయితే స్పీకర్ తమ్మినేని సీతారం ఆ వాయిదా తీర్మానాన్ని తిరస్కరించారు. ఈ క్రమంలో చర్చించాల్సిందేనని టీడీపీ ఎమ్మెల్యేలు పోడియాన్ని చుట్టుముట్టారు. స్పీకర్‌కు ఎమ్మెల్యే జోగేశ్వరరావు ఉల్లిపాయల గిఫ్ట్ ప్యాక్ ఇచ్చారు. పౌరసరఫరాల మంత్రి నియోజకవర్గంలోనే క్యూలో నిలబడి సాంబయ్య మృతిచెందిన విషయాన్ని టీడీపీ ఎమ్మెల్యేలు సభలో గుర్తుచేశారు. ఈ గందరగోళం మధ్యనే మహిళలకు భద్రతకు సంబంధించిన బిల్లును హోంమంత్రి సుచరిత శాసనసభలో ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో హోంమంత్రి ప్రసంగానికి టీడీపీ ఎమ్మెల్యేలు అడ్డుతగిలారు. దీంతో స్పందించిన జగన్మోహన్‌రెడ్డి హోం మంత్రి మాట్లాడుతుంటే అడ్డుకుంటారా..? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అత్యాచార ఘటనల్ని నిరోధించేందుకు ఇలాంటి చట్టం అవసరమని సీఎం చెప్పుకొచ్చారు. ముఖ్యమైన అంశంపై చర్చ జరిగేటప్పుడు టీడీపీ ఎమ్మెల్యేల ప్రవర్తన బాగాలేదని జగన్ మండిపడ్డారు. ప్రతిపక్షం ఉల్లిపాయల మీద ఏదైతే సబ్జెక్ట్ తీసుకొని వస్తున్నారో ఆ ఉల్లిపాయలపై చర్చ జరపటానికి సిద్ధంగానే ఉన్నామని జగన్ అన్నారు. దేశంలో ఏ ప్రభుత్వం చెయ్యని కార్యక్రమాలు మా ప్రభుత్వం చేస్తోందని జగన్ అన్నారు. ఉల్లి గురించే మాట్లాడుతున్నానని దేశం మొత్తం మీద ఏపీలో మాత్రమే కేజీ 25 రూపాయలకు ప్రజలకు అందుతోందని జగన్ అన్నారు. ఇంత తక్కువ రేటుకు ఉల్లిని అమ్ముతున్న రాష్ట్రం ఆంధ్ర రాష్ట్రమే అని సీఎం జగన్ అన్నారు. ప్రతి రైతు బజార్ లోను రూ.25కే కేజీ ఉల్లిని అమ్ముతున్నామని జగన్ చెప్పారు. ఇప్పటివరకు 36,536 క్వింటాళు కొనుగోలు చేసి రైతు బజార్లలో కేజీ 25 రూపాయలకు అమ్ముతున్నామని జగన్ అన్నారు. సోలాపూర్, అల్వాల్ నుండి కూడా ఉల్లిని కొనుగోలు చేసున్నామని సీఎం జగన్ చెప్పారు. ఎక్కడ ఉల్లి దొరికితే అక్కడ ఉల్లిని కొనుగోలు చేసే కార్యక్రమం చేస్తున్నామని చెప్పారు. చంద్రబాబు హయాంలో ఉల్లి పంట రైతులకు గిట్టుబాటు కాక పొలాల్లోనే వదిలేసిన పరిస్థితిని చూశామని చెప్పారు. ఈరోజు రైతులకు గిట్టుబాటుధర లభిస్తోందని, వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జగన్ చెప్పారు. చంద్రబాబు హెరిటేజ్ షాపులో కేజీ ఉల్లి 200 రూపాయలకు అమ్ముతున్నారని జగన్ అన్నారు. 200 రూపాయలకు అమ్ముతున్న వీరా మాట్లాడేది అని జగన్ ప్రశ్నించారు. మీరుచేసే పనులకు న్యాయం, ధర్మం ఉందా అని జగన్ అన్నారు. మహిళల భద్రత గురించి చర్చజరగాల్సిన అవసరం ఉందని జగన్ అన్నారు. మహిళల భద్రత గురించి లోతైన చర్చ జరగాలని చట్టంకూడా తీసుకొనిరాబోతున్నామని సీఎం జగన్ చెప్పారు.

# మాటల యుద్ధం!

### ■ తొలిరోజే వాడీవేడిగా అసెంబ్లీ సమావేశాలు
### ■ విద్యుత్ ఒప్పందాలపై అసెంబ్లీలో రగడ
### ■ ఆరునెలల్లో పీపీఏలపై ఏంచేశారు?
### ■ కమిటీవేసి గందరగోళాన్ని సృష్టిస్తున్నారు
### ■ ప్రభుత్వం తీరుతో రాష్ట్రం విద్యుత్ సమస్యతో అల్లాడుతుందన్న టీడీపీ
### - ఈ పరిస్థితికి గత ప్రభుత్వమే కారణమని వైకాపా కౌంటర్



అమరావతి, డిసెంబర్9(ఆర్ఎన్ఎ) : ఏపీ అసెంబ్లీ తొలిరోజే వైకాపా, టీడీపీ సభ్యుల మాటల దాడితో దద్దరిల్లిపోయింది. సభ ప్రారంభంకాగానే.. ప్రశ్నోత్తరాల సమయంలో అధికార-ప్రతిపక్షం మధ్య మాటల యుద్ధం నడిచింది. విద్యుత్ రంగంలో గోపాల్‌రెడ్డి కమిటీ ఇచ్చిన నివేదికపై ఏం చర్యలు తీసుకున్నారంటూ ప్రభుత్వాన్ని టీడీపీ ప్రశ్నించింది. గత ప్రభుత్వ హయాంలో పీపీఏలో ఎలాంటి అవకతవకలు జరగలేదని టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అన్నారు. పీపీఏలపై కమిటీలు వేసి గందరగోళం పరుస్తున్నారని..

ఈ ప్రభుత్వ విధానాల వల్ల పెట్టుబడులు పెట్టాలంటే ఆలోచిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఆరు నెలలు ఏం చేశారని ప్రశ్నించారు. రామానాయుడు ప్రశ్నకు ఆర్థిక మంత్రి బుగ్గన సమాధానం ఇచ్చారు. కేబినెట్ సబ్ కమిటీ అన్నింటినీ పరిశీలి స్తోందని, అన్ని పరిశీలించి తగిన సమయంలో నివేదిక సమర్పిస్తుందని మంత్రి తెలిపారు. లక్ష్యాలను దాటి గత ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుందని, 15రోజుల్లో 41 పీపీఏలు చేసుకున్నారని ఆరోపించారు. వాడినా వాడకున్న పీపీఏల కింద డబ్బులు కట్టాల్సిందేనని, దాని వల్ల డిస్కంలను అప్పుల్లో ముంచారన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక గత నెల డిస్కంలకు రూ.4,900 కోట్లు ఇచ్చామని బుగ్గన తెలిపారు. గత ప్రభుత్వం డిస్కంలను ముంచేసిందని, వాస్తవాలను టీడీపీ నేతలు జీర్ణించుకోవడం లేదన్నారు. గత పదేళ్లలో రూ.20వేల కోట్ల నష్టాల్లోకి తెచ్చారని, డిస్కంలు మొత్తం కుప్పకూలే స్థితికి తీసుకొచ్చారని ఆరోపించారు. పవర్ కంపెనీలకు రూ.10వేల కోట్ల సబ్సిడీ ఇవ్వాల్సి వస్తోందని, రూ.9వేల కోట్ల నుంచి రూ.29వేల కోట్లకు అప్పు తీసుకొచ్చారన్నారు.

### తన సీటు మార్చండి!

మంత్రి బుగ్గన సమాధానం ఇచ్చిన తర్వాత.. ప్రతిపక్ష నేత చంద్రబాబు మాట్లాడే అవకాశం ఇవ్వాలని టీడీపీ పట్టు పట్టింది. ప్రశ్నోత్తరాల సమయంలో ఇలా సభను అడ్డుకోవడం సరికాదని.. తర్వాత అవకాశం ఇస్తామని స్పీకర్ తమ్మినేని వారించినా ప్రతిపక్ష సభ్యులు వెనక్కు తగ్గలేదు.

ఈ క్రమంలో వైసీపీ ఎమ్మెల్యే ఆనం రాంనారాయణరెడ్డి కలగజేసుకొని ప్రశ్నోత్తరాల సమయంలో ఇలా సభను అడ్డుకొని, నిరసన అనడం సరికాదన్నారు. సభా సంప్రదాయాలను పాటించాలన్నారు. ఈ క్రమంలో అరాచక శక్తులంటూ ప్రతిపక్షం చేసిన వ్యాఖ్యలపై ఆనం అభ్యంతరం వ్యక్తం చేశారు. చంద్రబాబు తమను అరాచక శక్తులు అంటారా అని మండిపడ్డారు. దయచేసి నా సీటు మార్చండి సార్.. సభ్యులు ఎవరైనా మాట్లాడితే మాట్లాడుతాను కానీ.. ప్రతిపక్ష నేతే నా పక్కన నిలబడితే నేనేం మాట్లాడగలను సార్.. ఆయన నా పక్కన నిల్చున్నా.. కూర్చున్నా మాట్లాడేంత ధైర్యం, శక్తి నాకుందా సార్.. వారి ముందు నేను చాలా చిన్నవాణ్ణి.. వారొచ్చి నా పక్కన నిల్చుంటే నేనేం మాట్లాడగలను అంటూ ఆనం చంద్రబాబుపై సెటైర్లు వేశారు. దయచేసి అరాచక శక్తులు అనే పదం వారు ఉపసంహరించుకోమని చెప్పండి లేదా మీరైనా (స్పీకర్) రికార్డ్సులో నుంచి తొలగించండని ఆనం ఒకింత సెటైరికల్‌గా మాట్లాడారు. అయితే ఆనం మాట్లాడు తున్నంత సేపు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నవ్వుతూనే ఉన్నారు. మరోవైపు.. వైసీపీ సభ్యులు కూడా నవ్వు ఆపుకోలేకపోయారు. ఆ తర్వాత వైసీపీ ఎమ్మెల్యే అంబటి రాంబాబు కూడా చంద్రబాబు వ్యాఖ్యల్ని తప్పుబట్టారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు క్షమాపణ చెప్పాలని కోరారు. దీంతో స్పీకర్ కల్పించుకొని అరాచక శక్తులు అన్న పదాన్ని అసెంబ్లీ రికార్డుల నుంచి తొలిగిస్తున్నట్లు ప్రకటించటంతో వివాదం సర్దుమనిగింది.

# టీడీపీ ఎమ్మెల్యేల వెనుకాల వల్లభనేని వంశీ!

### - దూరంగా ఒక్కడే కూర్చున్న వంశీ

అమరావతి, డిసెంబర్9(ఆర్ఎన్ఎ) : ఏపీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం అయ్యాయి. కాగా ఈ సమావేశాల ప్రారంభానికి ముందు వల్లభనేని వంశీపైనే అందరి దృష్టి పడింది. వంశీ టీడీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన విషయం విధితమే. కాగా ఆయన వైసీపీ చేరుతానని చెప్పారు.అయినా ఇప్పటి వరకు వైసీపీలో చేరలేదు. మరోవైపు టీడీపీసైతం వంశీని పార్టీనుండి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో అసెంబ్లీ సమావేశాల్లో వంశీ ఎక్కడ కూర్చున్నారనే చర్చ సాగింది. కాగా సోమవారం ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాల్లో వంశీ టీడీపీ బెంచీల వైపు వెనుక వరుసలో కూర్చున్నారు. టీడీపీ సభ్యులకు కేటాయించిన సీట్లలోనే వెనుక వరుసలో ఎవరితో సంబంధం లేకుండా ఓ మూలన కూర్చున్నట్టుగా వెనుకాల వల్లభనేని వంశీ కూర్చున్నారు. టీడీపీ సభ్యులతోనూ, వైసీపీ సభ్యులతోనూ పెద్దగా మాట్లాడలేదు. ఇదే సమయంలో వంశీ దగ్గరకి వెళ్లిన పలువురు టీడీపీ సభ్యులు టీడీఎల్పీ కార్యాలయంలోకి రావాలని కోరారు. వంశీ సున్నితంగా తిరస్కరించారు. తరువాత వారు వంశీతో కొద్దిసేపు మాట్లాడి అక్కడి నుంచి వెళ్లిపోయారు. టీడీపీ ఎమ్మెల్యేలు వంశీ వద్ద నుంచి వెళ్లిన కొద్దిసేపటి తర్వాత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వంశీ వద్దకు వచ్చారు. తమ కార్యాలయంలోకి రావాలని కోరగా వంశీ స్పందించలేదు. దీంతో వంశీ కొద్దిరోజులు మౌనంగా ఉండాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీ సమావేశాల అనంతరం వైసీపీలో చేరేందుకు వంశీ సిద్ధమైనట్లు ఆయన వర్గీలు పేర్కొంటున్నారు. ఇదిలా ఉంటే మరోవైపు టీడీపీ ఎమ్మెల్యే గొట్టిపాటి రవిసైతం వైసీపీలోకి వెళ్తారనే ప్రచారం సాగింది. కాగా సోమవారం ఆయన అసెంబ్లీలో టీడీపీ ఎమ్మెల్యేల వెంటే కూర్చున్నారు. అసెంబ్లీ ఆవరణంలో టీడీపీ వీడుతున్నారా..? అని విలేకరులకు రవిని ప్రశ్నించగా.. తాను పార్టీ మారబోనని, ఆ పరిస్థితి లేదని అన్నారు. తనపై అసత్య ప్రచారం జరుగుతుందని, తాను టీడీపీలోనే కొనసాగానని గొట్టిపాటి తేల్చి చెప్పారు. మరోవైపు టీడీపీ ఎమ్మెల్యేలు పలువురు అసెంబ్లీ సమావేశాలకు గైర్హాజరయ్యారు. ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్ అసెంబ్లీకి హాజరుకాలేదు. గత కొంతకాలంగా ఆయన టీడీపీ కార్యక్రమాలకు అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్నాడు. పలువురు బీజేపీ కేంద్ర పెద్దలతోనూ భేటీ అయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన బీజేపీలోకి వెళ్తున్నారని ప్రచారం సాగింది. గత మూడు రోజుల క్రితం తాను టీడీపీలో ఉంటానని గంటా ప్రకటించారు. కాగా ఆయన సోమవారం జరిగిన అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకపోవటం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ, మరో టీడీపీ ఎమ్మెల్యేలు తమ సొంత పనులపై అసెంబ్లీకి రాలేక పోతున్నామని టీడీపీ అధిష్టానానికి తెలిపారు. మొత్తంమీద సోమవారం 17మంది టీడీపీ ఎమ్మెల్యేలు మాత్రమే సభకు హాజరయినట్లు తెలిసింది.

## ఏపిలో స్తబ్దుగా కాంగ్రెస్ కార్యక్రమాలు

### అంటీముట్టనట్లుగా నేతల వ్యవహారం

విజయవాడ,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): ఎపి కాంగ్రెస్ చుక్కాని లేని నావలా సాగుతోంది. ప్రస్తుతం కాంగ్రెస పార్టీ అంతా ఖాళీ అవుతున్నా పట్టించుకోవడంలేదు. కార్యకర్తలో మనోధైర్యం నింపే ప్రయత్నం చేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. సొంత పార్టీ నేతల నుంచే విమర్శలు ఎదుర్కొంటున్నారు. కడపజిల్లాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేతలు సి.రామచంద్రయ్య వైకాపాలో చేరడంతో వాణి వినిపించేవారు కరువయ్యారు. తులసిరెడ్డి వంటి నేతలు ఇప్పుడిప్పుడే క్రియాశీలక పాత్రలోకి రంగప్రవేశం చేస్తున్నారు. తెలంగాణతో పోలిస్తే ఎపిలో స్తబ్దుగా ఉందన్న విమర్శలు ఉన్నాయి. అయితే ప్రస్తుతం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి ఈ మధ్యకాలంలో ఎక్కడా కనిపించడం లేదు. వినిపించడం లేదు. గతంలో స్వతహాగా కార్యక్రమాలు చేస్తూ జిల్లాల్లో పర్యటించిన ఆయన కూడా తెరమరుగయ్యారు.మాజీ మంత్రి, పిసిసి ఉపాధ్యక్షుడు శైలజానాథ్ సైతం పార్టీ కార్యక్రమాలలో అనుకొన్నమేర ఉత్సాహంతో పాల్గొనడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.పశ్చిమ గోదావరి నుంచి వట్టి వసంత్‌కుమార్ కూడా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. పళ్లం రాజు వంటి నేతలు కూడా అప్పుడప్పుడే కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేసే దిశగా అడుగులు వేసినా అది కూడా ఇప్పుడు కానరావడం లేదు. కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నేతలు కొందరు పార్టీ పరంగా ఆందోళన కార్యక్రమాలకు సిద్ధమవుతున్నా ఇంకా కొంతమంది సీని యర్లు దూకుడు పెంచాల్సిన అవసరముందని ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. అనేకులు ఉన్నా పార్టీ బలోపేత కార్యక్రమాలకు శ్రీకారం చుట్టకుండా మౌనంగా ఉండిపోతున్నారని కాంగ్రెస్ శ్రేణులు వాపోతున్నాయి. కాంగ్రెస్ సీనియర్‌నేత టి.సుబ్బిరామిరెడ్డి కేవలం రాజ్యసభకే పరిమితంఅయ్యారు. మిగతా నేతు కూడా పార్టీ బలోపేతం కోసం దృష్టి సారించడం లేదన్న విమర్శలను ఎదుర్కొంటున్నారు. పార్టీలో ఇప్పటికీ కొనసాగుతున్న సీనియర్ నేతలు మాత్రం ఇప్పుడు పార్టీ బలోపేతం దిశగా దృష్టిసారిం చకపోవడంపై ఆ పార్టీ శ్రేణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి.

## ఉల్లి ధరల పెరుగుదలపై.. టీడీపీ వినూత్న నిరసన

### - మెడలో ఉల్లిపాయల దండలతో అసెంబ్లీ ఎమ్మెల్యేలు
### - అడ్డుకున్న భద్రతా సిబ్బంది
### - ఉల్లిధరలు నియంత్రణలో వైకాపా విఫలమైంది
### - ఏపీ ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు

అమరావతి, డిసెంబర్9(ఆర్ఎన్ఎ) : ఏపీలో ఉల్లి ధరల పెరుగుదలను నిరసిస్తూ టీడీపీ ఎమ్మెల్యేలు వినూత్నరీతిలో నిరసన తెలిపారు. సోమవారం ఏపీలో అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు ప్రతిపక్షం టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మెడలో ఉల్లిపాయ దండలతో అసెంబ్లీకి వచ్చారు. ప్లకార్డులతో నిరసనను తెలిపారు. అసెంబ్లీ గేటు దగ్గర భద్రతా సిబ్బంది టీడీపీ ఎమ్మెల్యేలను అడ్డుకున్నారు. ఉల్లి దండలు, ప్లకార్డులకు అనుమతి లేదన్నారు.. దీంతో పోలీసులతో టీడీపీ ఎమ్మెల్యేల వాగ్వాదం జరిగింది. అంతకుముందు టీడీపీ అధినేత, ప్రతిపక్ష నేత చంద్రబాబు పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి వెంకటపాలెంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. అక్కడి నుంచి ర్యాలీగా అసెంబ్లీకి వచ్చారు.ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ఉల్లి ధరలు మండుతుంటే ప్రభుత్వం ప్రజలను వారి ఖర్మకు వదిలేసిందని విమర్శించారు. రాష్ట్రంలో ఉల్లిధరలు బంగారంతో సమానంగా ఉన్నాయని, ఉల్లి ధరలను ప్రభుత్వం నియంత్రించలేకపోతోందని ఆరోపించారు. ఉల్లి ధరలను వ్యతిరేకిస్తూ సచివాలయం ఫైర్‌స్టేషన్ వద్ద చంద్రబాబు అధ్యక్షతన తెదేపా నేతలు నిరసనకు దిగారు. ఉల్లిపాయల దండలు మెడలో వేసుకొని ఆందోళన చేపట్టారు. తక్కెడలో బంగారం, ఉల్లిపాయలు పెట్టి రెండూ సమానమేనని చంద్రబాబు చూపించారు. తెదేపా హయాంలో నిత్యావసర ధరలు పెరగకుండా చర్యలు తీసుకున్నామని, సబ్సిడీపై తక్కువ ధరలకే అందించామని ఆయన గుర్తు చేశారు. ఉల్లి ధరలు దిగివచ్చేవరకు తెదేపా పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కొద్దిసేపు ఆందోళణ నిర్వహించిన అనంతరం వారు అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యారు.

## శ్రీవారికి పెరుగుతున్న విరాళాలు

తిరుమల,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): తిరుమలలో వివిధ సేవలకు విరాళాలు భారీగా వస్తున్నాయి. సేవలను పెంచాలన్న భావన భక్తుల్లో పెరుగుతోంది. తిరుపతికి చెందిన వ్యాపారవేత్త కె.భాస్కర్‌రావు తన కుమారుడు త్రిలోక్‌తో కలిసి ఇటీవల ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా అందించారు. ఈ మేరకు డిడిని టిటిడి ఈవో శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో శ్రీ ఎవి.ధర్మారెడ్డికి దాతలు అందజేశారు. అన్ని దానాల కన్నా అన్నదానం చేయడం ఎంతో ఉత్తమమైనదని టిటిడి ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ అన్నారు. అన్నదానం మహాదానమని, టిటిడి అన్నప్రసాద విభాగం కొన్ని దశాబ్దాలుగా భక్తులకు విశిష్టమైన సేవలు అందిస్తోందని కొనియాడారు. ప్రతిరోజూ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు విరాళాలు వస్తున్నాయని, ప్రస్తుతం రూ.1,350 కోట్ల మొత్తం ఉందని వెల్లడించారు. గత ఏడాది రూ.141 కోట్ల విరాళాలు వచ్చాయని, వడ్డీ రూపంలో రూ.79 కోట్లు అందిందని తెలిపారు. గత ఏడాది అన్నప్రసాదాల వితరణకు అయిన ఖర్చు రూ.99.90 కోట్లు అని తెలియజేశారు. రానున్న రెండు, మూడు సంవత్సరాల్లో అన్నప్రసాదం ట్రస్టు స్వయం ప్రతిపత్తి సాధిస్తుందన్నారు. ప్రస్తుతం సాధారణ రోజుల్లో దాదాపు లక్ష మంది, రద్దీ రోజుల్లో లక్షా 50 వేల మంది వరకు భక్తులు అన్నప్రసాదాలు స్వీకరిస్తున్నారని ఈవో తెలిపారు. అన్నప్రసాదాల తయారీకి రోజుకు 6 నుండి 7 టన్నుల కూరగాయలను వినియోగిస్తున్నామని, అదనపు ఈవో ఎవి.ధర్మారెడ్డి ప్రత్యేక చొరవతో గత రెండు నెలల్లో 55 టన్నుల బియ్యం విరాళంగా అందిందని వివరించారు. గరుడసేవ, రథసప్తమి, వైకుంఠ ఏకాదశి లాంటి విశేషమైన రోజుల్లో పెద్ద సంఖ్యలో విచ్చేస్తున్న భక్తులకు అన్నప్రసాదం సిబ్బంది, శ్రీవారి సేవకులు విశేషంగా సేవలందిస్తున్నారని అభినందించారు.

## సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

కాకినాడ,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు-పాక దగ్ధమైన ఘటన సోమవారం వెలుగు చూసింది. తూర్పు గోదావరి జిల్లా మలికిపురం మండలంలోని శంకరగుప్తం శివారు చిన్నఅడవిపాలెం గ్రామంలో మత్స్యకారుడు బందన రంగారావు తాటాకు ఇంట్లో నివాసముంటున్నాడు. ఆదివారం ఇంట్లో వంట వండుతుండగా.. గ్యాస్ లీకై మంటలు వ్యాపించి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. గ్యాస్ సిలిండర్ కూడా పేలిపోయి, ఇంట్లోని సామానంతా కాలిబూడిదైంది. ఇల్లు అంటుకున్న సమయంలో కుటుంబ సభ్యులందరూ బయట ఉండటంతో ప్రాణ నష్టం జరగలేదు. బందన రంగారావు ఇంటికి ఎదురుగా ఉన్న తిరుమాని అర్జునరావుకు చెందిన వంటపాకకు కూడా మంటలు అంటుకొని పాక పూర్తిగా కాలి బూడిదైంది. ఘటన జరిగిన వెంటనే వీఆర్ఓ రెవెన్యూ సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు నమోదు చేసి తహసీల్దారు కు సమాచారాన్ని అందించారు.




తూర్పుగోదావరి జిల్లా మలికిపురం మండలలో గ్యాస్ లీకై దగ్ధమైన గుడిసె

## కమాండర్‌ను కాల్చి ఆత్మహత్యచేసుకున్న కానిస్టేబుల్

రాంచీ,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): ఛత్తీస్‌గఢ్‌కు చెందిన భద్రతా బలగాలు జార్ఖండ్ శాసనసభ ఎన్నికల విధులకు వెళ్లాయి. అయితే విధుల్లో ఉన్న కానిస్టేబుల్ విక్రమ్ రాజ్‌వారే.. కమాండర్ రామ్‌ఖురేపై కాల్పులు జరిపాడు. దీంతో కమాండర్ ప్రాణాలు కోల్పోగా, విక్రమ్ కూడా తనకు తాను కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సోమవారం ఉదయం రాంచీలో చోటు చేసుకుంది. కాల్పుల ఘటన ఛత్తీస్‌గఢ్ బలగాల బృందంలోనే చోటు చేసుకుందని జస్‌పురా ఎస్పీ శంకర్ భఘేల్ తెలిపారు. ఈ ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎస్పీ పేర్కొన్నారు.

# ప్రత్యేకహోదాను తాకట్టు పెట్టింది చంద్రబాబు

## ఓటుకునోటులో హైదరాబాద్ నుంచి పారిపోయి వచ్చారు
## బాబు ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది
## అసెంబ్లీలో మండిపడ్డ మంత్రి కురసాల కన్నబాబు

అమరావతి,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): ప్రత్యేకహోదా, విభజన హామీల గురించి మాట్లాడే హక్కు టీడీపీకి లేదని మంత్రి కురసాల కన్నబాబు ధ్వజమెత్తారు. ఎపి పరువును తాకట్టు పెట్టి హైదరాబాద్ నుంచి పారిపోయి వచ్చారన్నారు. ఇంతకన్నా దారుణం మరోటి ఉంటుందా అని ఆయన శాసనసభలో ధ్వజమెత్తారు. ఐదేళ్ల బాబు హయాంలో ప్రత్యేక హోదాపై కనసీంగా ప్రయత్నించలేదన్నారు. పార్టీలు ఇచ్చిపుచ్చుకోవడం గురించి టీడీపీ సభ్యులు మాట్లాడుతున్నారని.. ఈ రాష్ట్రంలో పార్టీలు ఇచ్చి పుచ్చుకోవడం టీడీపీకి తెలిసినట్టుగా ఎవ్వరికీ తెలియదన్నారు. పార్టీలే కాదు, బీ ఫారాలు కూడా ఇచ్చిపుచ్చుకున్నారన్నారు. 2014 నుంచి ప్రత్యేక హోదా కోసం పోరాటం చేసిన వ్యక్తి వైఎస్ జగన్ ఒక్కరేనని తెలిపారు. ఢిల్లీ, గుంటూరులో దీక్షలు చేశారని, ధర్నాలు, యువభేరీ కార్యక్రమాలు నిర్వహించారని చెప్పారు. పార్టీ ఎంపీల చేత కూడా వైఎస్ జగన్ రాజీనామాలు కూడా చేయించారన్నారు. వైఎస్సార్‌సీపీ ఎంపీలు కన్నా.. టీడీపీ ఎంపీలు అప్పట్లో ఎక్కువ మంది ఉన్నారని, కాని చీమ కుట్టినట్టుకూడా వారికి అప్పుడు లేదన్నారు. ప్రత్యేక హోదా కన్నా ప్రత్యేక ప్యాకేజీయే బెటరని అప్పట్లో బల్లగుద్ది చంద్రబాబు చెప్పారన్నారు. అప్పట్లో ఆర్థిక మంత్రికి శాలువాలు కప్పి, స్వీట్లు పంచుకున్న చరిత్ర వారిదని..

ఇప్పుడు అదే వ్యక్తులు నీతులు చెప్తున్నారని మండిపడ్డారు. ఆరోజు నుంచి నేటి వరకూ ఈ రాష్ట్ర భవిష్యత్తు కోసం ప్రత్యేక హోదా కావాలంటూ మడమ తిప్పకుండా మాట్లాడుతున్న వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని అన్నారు. ప్రత్యేక హోదా అవసరం లేదని చెప్పిన చంద్రబాబు.. ఆ తర్వాత రాత్రికి రాత్రి యూటర్న్ తీసుకున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రయోజనాలను కేంద్ర ప్రభుత్వం దెబ్బతీసి, ప్రత్యేక హోదా ఇవ్వకపోయినా సరిపెట్టుకుంటారన్న ఒక మైండ్‌సెట్‌ని క్రియేట్ చేసింది చంద్రబాబేనన్నారు. అలా చేయకపోతే ప్రత్యేక హోదాపై కేంద్ర ప్రభుత్వం ఆలోచించి ఉండేదన్నారు. 'షీలా బీడే కమిటీ ఈ జనవరితో అయిపోయింది. వాళ్లు 89 రికమెండేషన్లు ఇస్తే.. ఈ ప్రభుత్వం వచ్చాక 68 రికమెండేషన్లకు తెలంగాణ ప్రభుత్వం అంగీకరించింది. మేం అవన్నీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పింది. తెలంగాణ ప్రభుత్వం ఏ అభ్యంతరాలు పెట్టకుండా 68 సిఫార్సులకు సానుకూలత తెలిపింది. కాని ఆ రోజు టీడీపీ ప్రభుత్వం ఏం చేసింది. రాజకీయం చేసింది. ఓటుకు కోట్లు కేసులో దొరికిపోయిన తర్వాత పారిపోయి ఈ రాష్ట్రానికి వచ్చేశారు. హైదరాబాద్ 10 సంవత్సరాల పాటు ఉమ్మడి రాజధాని అయితే... కట్టుబట్టలతో పారిపోయి వచ్చారని' కన్నబాబు దుయ్యబట్టారు. హైదరాబాద్‌లో ఉన్న ఏపీ ప్రజలు బాధపడే పరిస్థితి ఏర్పడిందని.. చేసిందంతా చేసి ఇవాళ నీతి కథలు, పిట్ట కథలు చెబుతున్నారని ధ్వజమెత్తారు. టీడీపీకి ప్రత్యేక హోదాపైన, విభజన హామీలపైన మాట్లాడే హక్కులేదని.. ఐదేళ్ల పాటు ఏమీ చేయకపోగా, ఆరునెలల్లో ఏదో జరిగిపోయిందన్నట్టుగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ ఎంపీలు రాజీనామాలు చేసినప్పుడే టీడీపీ ఎంపీలు కూడా రాజీనామాలు చేసి ఉంటే ఫలితం ఉండేదని, కాని అలా చేయకుండా మోదీ అన్యాయం చేశారని ఎన్నికల ముందు మాట్లాడి, ఇప్పుడు మళ్లీ మోదీతో జతకట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. నలుగురు ఎంపీలను బీజేపీలోకి పంపించి మళ్లీ ఇక్కడ మరోలా మాట్లాడుతున్నారన్నారు. ఉద్యోగులకు సంబంధించిన అంశాలను పరిష్కరించడానికి, ఆస్తుల పంపిణీ గురించి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందన్నారు. తెలంగాణ ఇచ్చిన భవనాల్లో ఏదీ కూడా విభజన చట్టంలోని పరిధిలోనిది కాదని.. విభజన చట్టంలో భవనాల్లోని ఒక్క గదిని కూడా అప్పగించలేదని స్పష్టం చేశారు. టీడీపీ అధికారంలో ఉండగా... విభజన చట్టంలోని భవనాలను ఆక్రమిస్తే ఒక్కసారి కూడా మాట్లాడలేదన్నారు. అక్కడ సచివాలయంలో భవనాలు ఎందుకు వృథాగా పడి ఉన్నాయని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి కార్యాలయం కోసం అభివృద్ధి చేసిన దాన్ని కూడా విడిచిపెట్టారని.. ఇప్పుడు అక్కడ ఉండకపోయినా, బూజు పట్టినా.. కరెంటు బిల్లుల రూపేణా కట్టాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఐదేళ్లపాటు వాళ్లు చేసిన నిర్వాకానికి మరో ఐదేళ్ల పాటు కష్టపడితే తప్ప తీరని విధంగా సమస్యలు సృష్టించారన్నారు. మనకు కేటాయించిన భవనాలను తెలంగాణ ప్రభుత్వం ఆక్యుపై చేసినా.. అడగలేకపోయారని.. కారణం ఓటుకు నోటు కేసులో అప్పటి ముఖ్యమంత్రికి ఉన్న బలహీనత అని తెలిపారు. ఢిల్లీతో సంబంధాల విషయంలో ఎన్నిసార్లు నాలుకలు మడతపెట్టారో టీడీపీ వాళ్లకే తెలియాలని ఎద్దేవా చేశారు.

# హ్యాట్సాఫ్ కేసీఆర్ : ఏపీ సీఎం జగన్

అమరావతి, డిసెంబర్ 9: తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్ ఏపీ అసెంబ్లీ సాక్షిగా అభినందించారు. దిశ హత్యాచార కేసు నిందితులను ఎన్‌కౌంటర్ చేయడం జరగకూడని పరిస్థితిలోనే జరిగిందని జగన్ పేర్కొన్నారు. దిశ కేసు నిందితులను ఎన్‌కౌంటర్ చేస్తే ఎన్‌హెచ్ఆర్సీ ఎందుకు వచ్చి నిలదీస్తుందని ఆయన ప్రశ్నించారు. నిర్భయ నిందితులకు ఇంకా శిక్ష పడలేదు. దీనిపై ఏం సమాధానం చెబుతారని జగన్ అడిగారు.

ఆ రాష్ట్ర అసెంబ్లీలో ఆంధ్రప్రదేశ్‌లో మహిళల భద్రతపై స్వల్పకాలిక చర్చ జరిగింది. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. దిశ హత్యాచార కేసు సమాజం సిగ్గుతో తలదించుకునే ఘటన. దిశపై అత్యాచారం చేసి కాల్చేసిన ఘటన దారుణం. దిశ ఘటనను చూసిన తర్వాత ఆమె తల్లిదండ్రుల పడిన ఆవేదన చూసిన నిందితులను కాల్చేసిన పర్వాలేదనుకున్నాను. నాకు భార్య, పిల్లలు, చెల్లి ఉంది. మన ఇంట్లో ఇలాంటి ఘటనలు జరిగితే మనం ఊరుకుంటామా? నిందితులకు ఏరకమైన శిక్ష పడితే తనకు ఉపశమనం కలుగుతుందో ఆలోచించాలి. వాళ్లకు ఏ రకమైన శిక్ష పడితే ఉపశమనం కలుగుతుందో దాన్నే తెలంగాణ ప్రభుత్వం అమలు చేసింది. హ్యాట్సాఫ్ టూ కేసీఆర్, తెలంగాణ పోలీసులు. జరగకూడని పరిస్థితుల్లో ఎన్‌కౌంటర్ జరిగింది.

నిజజీవితంలో దమ్మున్నోళ్లు ఎవరైనా చేస్తే ఎన్‌హెచ్ఆర్సీ ఢిల్లీ నుంచి పరుగెతుకుంటూ ఎందుకు వచ్చింది. నిందితులను ఎందుకు ఎన్‌కౌంటర్ చేశారని ప్రశ్నిస్తున్న పరిస్థితిని చూస్తున్నాం. దారుణమైన పరిస్థితుల్లో చట్టాలు ఉన్నాయి. ఢిల్లీలో నిర్భయ ఘటన తర్వాత నిర్భయ చట్టం తీసుకువచ్చాం. నాలుగు నెలల్లో తీర్పు ఇచ్చి శిక్ష విధించాలని నిర్భయ చట్టం చెబుతుంది. మరి నిర్భయ కేసులో ఏడేళ్లు అవుతున్న శిక్ష అమలు కావడం లేదు. దిశ లాంటి ఘటనలు హృదయాలు కలిచివేస్తాయి. ఓ తండ్రిగా నేను ఆ బాధను అర్థం చేసుకోగలను అని సీఎం జగన్ ఆవేదన వ్యక్తం చేశారు.

# ఉల్లి సాగుకు ప్రోత్సాహం అందించండి: మంత్రి నిరంజన్ రెడ్డి



హైదరాబాద్, డిసెంబర్ 9:నారాయణఖేడ్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే భూపాల్ రెడ్డితో కలిసి రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వ్యవసాయ, సహకార, ఉద్యానశాఖలపై సమీక్ష నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాటాడుతూ... కూరగాయల సాగును పెంచాలని, ఉల్లి సాగుకు ప్రోత్సాహం అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పత్తి కొనుగోలు కేంద్రాలను తరచూ సందర్శించండి. సీసీఐ కొనుగోలు కేంద్రాలలో ఏ మాత్రం అవకతవకలు జరగొద్దు. ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని సూచించారు.

ఉల్లి పంట ప్రోత్సాహానికి ప్రభుత్వ సబ్సిడీ విత్తనం అందించే యోచనలో ఉన్నట్లు తెలిపారు. రైతులు నష్టపోకుండా ప్రభుత్వం నుంచి కొనుగోలుకు ఒక ధరను నిర్ణయించాలని భావిస్తున్నాం. సంగారెడ్డి జిల్లా కావడంతో కూరగాయలు, ఇతర నిత్యావసరాల వాడకం పెరుగుతుంది. ఎండాకాలంలో రైతులు తప్పనిసరిగా కూరగాయలు సాగుచేసేలా చూడాలి.

రైతులు వేసిన పెసరపంటను వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ధారించాలి. కిచెన్ గార్డెన్ లపై ప్రజలకు అవగాహన కల్పించి ప్రోత్సహించండి. పందిరి కూరగాయల సాగుకు సహకారం 90 శాతం సబ్సిడీతో సహకారం అందిస్తున్నాం. అర ఎకరా నుంచి ఎకరా వరకు పందిళు వేసుకునేందుకు అనుమతి ఇస్తున్నాం.

ఎరువులు, రసాయనాల వాడకంపై రైతులను చైతన్యం చేయండి. వరికి ఎకరాకు 40 కిలోల యూరియాకు మించి వాడడం వృధా, దీనిపై రైతులకు అవగాహన కల్పించండని ఆదేశించారు. అనంతరం నారాయణఖేడ్ మండలం ఆకుల లింగాపూర్ లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శించి రైతులకు మద్దతుధర వచ్చేలా సహకరించాలని, తూకాలలో ఎలాంటి అవకతవకలు జరిగి రైతు నష్టపోకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు .. కొనుగోలు కేంద్రంలో పరిస్థితులపై రైతులను అడిగి తెలుసుకున్నారు.

# ఢిల్లీలో కదం తొక్కిన ఆదివాసీలు

## హక్కుల సాధనకే పోరాటం అన్న సోయం బాపూరావు

న్యూఢిల్లీ,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): లంబాడాలను ఎస్టీ జాబితాలో చేర్చడం అసంబద్ధం అని బీజేపీ ఎంపి సోయంబాపూరావు అన్నారు. లంబాడాలను ఎస్టీ జీబితాలో కలపడం వలన ఆదివాసీ యువత విద్య, ఉపాధి కోల్పోతున్నారని అన్నారు. ఎస్టీ రిజర్వేషన్లలో 97శాతం లంబాడాలే అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. సోమవారం రాంలీలా మైదానంలో ఆదివాసీల బహిరంగ సభ జరిగింది. ఈ బహిరంగ సభకు ఎంపీ సోయం బాపూరావు, ఎమ్మెల్యే సీతక్క, వేలాది మంది ఆదివాసీలు హాజరయ్యారు. లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో ఆదివాసీ లోకం కదం తొక్కింది. ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఢిల్లీలో సభకు హాజరయ్యారు. ఆదివాసీలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో పోలీసులు భద్రత చేపట్టారు. ఈ సందర్భంగా సోయం బాబూరావు మాట్లాడుతూ ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలన్నారు. లంబాడీలకు ఏజెన్సీ ధ్రువపత్రాలు ఇవ్వకూడ దన్నారు. ఇచ్చిన తహసీల్దార్‌లపై చర్యలు తీసుకోవాలన్నారు. తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించిన వారిపై చర్యలు చేపట్టాలన్నారు.

# లంచం వాపస్...వీఆర్వో సస్పెన్షన్

జగిత్యాల,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): రైతు వద్ద వీఆర్వో తీసుకున్న లంచం సొమ్మును కలెక్టర్ వాపస్ ఇప్పించారు. ఈ ఘటన జగిత్యాల జిల్లాలో చోటు చేసుకుంది. భూమి పట్టా కోసం రైతు వద్ద రూ.10 వేలు లంచంను వీఆర్వో రమేశ్‌రెడ్డి తీసుకున్నాడు. డబ్బు ఇచ్చినా వీఆర్వో పని చేయడం లేదని రైతు ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. రైతు ఫిర్యాదు మేరకు కలెక్టర్ శరత్ వీఆర్వోను పిలిచి విచారణ జరిపారు. లంచం సొమ్ము వాపస్ ఇప్పించిన కలెక్టర్ వీఆర్వో, వీఆర్ఏలను సస్పెండ్ చేశారు. లంచం ఇవ్వడం, లంచం డిమాండ్ చేయడం నేరమని ఎవరైనా లంచం కావాలని అడిగితే ఉన్నతాధికారులకు, ఏసీబీకి ఫిర్యాదు చేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# ఆంధ్రప్రదేశ్ మహిళాంధ్రప్రదేశ్‌గా మారాలి

**– మహిళలపై దాడి చేసిన వారికి బెయిల్ ఇవ్వొద్దు**
**– ఆడపిల్లల జోలికిరావాలంటే వెన్నులో వణుకు పెట్టేలా చట్టాలుండాలి**
**– ఏపీ అసెంబ్లీలో వైసీపీ ఎమ్మెల్యే రోజా**

అమరావతి, డిసెంబర్9(ఆర్ఎన్ఎ) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మహిళాంధ్ర ప్రదేశ్‌గా మారాలని వైకాపా ఎమ్మెల్యే రోజా అన్నారు. సోమవారం ఏపీ అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా తొలి రోజు మహిళల రక్షణకు సంబంధించిన అంశంపై నిర్వహించిన చర్చలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ.. దిశ ఘటన తర్వాత తొలిసారిగా ఏపీలో మహిళా భద్రతపై చర్చ జరుగుతుంటే దేశమంతా ఈ అసెంబ్లీలో ఎలాంటి చట్టాలు చేస్తారు? మనకు ఎలా భద్రత కల్పిస్తారని మహిళలంతా ఎదురు చూస్తున్నారన్నారు. మొన్న 'దిశ'ను అత్యాచారం చేసి చంపి దహనం చేసిన విధానం చూస్తుంటే మానవత్వం ఉన్న ఏ మనిషికైనా కన్నీళ్లొస్తాయన్నారు.

రాష్ట్రంలో మహిళలు, విద్యార్థులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారనీ.. ఆడ పిల్లలు కాలేజీలకు వెళ్లాలన్నా భయపడే పరిస్థితి నెలకొందన్నారు. నిన్న దిశ.. మొన్న రిషితేశ్వరి, ఆ ముందు నిర్భయ.. అంతకన్నా ముందుచూస్తే స్వప్నిక, ప్రణీత.. రేపు ఈ మృగాళ్లకు బలి కావాల్సింది ఎవరో అన్న భయంతో కంటిపై కునుకు లేకుండా మహిళలు భయుభ్రాంతులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. మహిళను అడవిలో వదిలేసి వస్తే భద్రంగా బయటకు వచ్చే అవకాశం ఉందేమో గానీ.. పొద్దున్న లేచి బయటకు వెళ్తే మాత్రం ఈ సమాజంలో తిరిగి వస్తుందనే నమ్మకం లేకపోవడం చాలా దురదృష్టకరమని రోజా ఆవేదన వ్యక్తంచేశారు.

ఆడ పిల్లకు కష్టం వచ్చేలోపు గన్ వచ్చేకంటే ముందే జగన్ వచ్చి రక్షిస్తాడనే ఒక నమ్మకం ప్రజలకు కావాలన్నారు. ఆడపిల్ల కళ్లల్లో కన్నీరు కారిస్తే ఆ కన్నీరు ఆవిరయ్యేలోపు వారికి శిక్ష వేస్తారన్న నమ్మకాన్ని ఈ అసెంబ్లీ ద్వారా ఇవ్వాల్సిన అవసరముందని, మహిళలు బతికి బట్టకట్టాలంటే సత్వర న్యాయం కావాలన్నారు. సత్వర న్యాయం జరగకుండా ఆలస్యమైతే అది అన్యాయంగా మారిపోతుందని రోజా అభిప్రాయపడ్డారు. జగనన్నను ఒకటే కోరాలనుకుంటున్నా అని, ఎవరైనా ఆడపిల్లల జోలికి వస్తే వారికి వెన్నులో వణుకు పుట్టేలా ఒక చట్టాన్ని తేవాలని రోజా కోరారు.

ఆంధ్రప్రదేశ్ అంటే ఆడవాళ్ల ప్రదేశ్‌గా మారాలని, ఏ రాష్ట్రంలోనైనా ఆడ పిల్లకు భయం వేస్తే ఏపీలో మనకు రక్షణ ఉంటుందన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ చరిత్రలోనే రెండు చోట్ల నుంచి నిలబడి ఓడిపోయిన గొప్ప నాయకుడని, ఆయన పార్టీకి చెందిన ఎమ్మెల్యే సభలో ఉన్నారని, ఆయన ద్వారా పవన్‌కు చెప్పాలనుకుంటున్నా.. అత్యాచారం చేసిన వారిని ఉరితీయడమేంటి? రెండు బెత్తం దెబ్బలు కొడితే చాలు అంటున్నారని అన్నారు. గతంలో ఏం జరిగిందని పవన్ రివాల్వర్ పట్టుకొని రోడ్లపైకి వచ్చారో చెప్పాల్సిన అవసరం ఉందని రోజా ప్రశ్నించారు. మా అక్కను అవమానిస్తే వారిని చంపాలనిపించిందని ఆయన ఇంటర్వ్యూలో చెప్పినదాన్నీ మనం విన్నామన్నారు. అయితే, ఆమె వ్యాఖ్యలపై స్పీకర్ తమ్మినేని సీతారాం అభ్యంతరం వ్యక్తంచేశారు. సభలో లేని వ్యక్తుల గురించి ప్రస్తావన వద్దని రోజాను వారించారు. అనంతరం రోజా మాట్లాడుతూ.. మహిళల భద్రతపై చట్టం తేవాలని చర్చజరిగేందుకు స్పీకర్ అనుమతిస్తే టీడీపీ నేతలు వద్దు ఉల్లిపై చర్చ జరపాలని అంటున్నారని, ఆడపిల్లల భద్రత అంటే టీడీపీ ఉపయోగంలేని అంశంగా భావించడం దుర్మార్గమన్నారు. బాలకృష్ణ మహిళలపై చేసిన వ్యాఖ్యలు, లోకేష్ బీచ్ వ్యవహారాలు, చింతమనేని వ్యవహారం మళ్లీ అసెంబ్లీలో చర్చకు ఎక్కడ వస్తాయోనని టీడీపీ భయపడిందని రోజా విమర్శించారు. టీడీపీ సభ్యుల తీరు మార్చుకోవాలని రోజా సూచించారు.

# నిర్భయ దోషులకు 16న ఉరి?

## తీహార్ జైలులో గోప్యంగా ఏర్పాట్లు

న్యూఢిల్లీ,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): క్షమాభిక్ష పిటిషన్లను రాష్ట్రపతి తిరస్కరించడంతో దేశ వ్యాప్తంగా సంచలన సృష్టించిన నిర్భయ దోషులకు ఉరిశిక్ష ఖరారైనట్లు సమాచారం. దోషుల్లో ఒకరైన వినయ్ శర్మ రాష్ట్రపతికి క్షమాభిక్ష పెట్టుకున్న విషయం తెలిసిందే. దీనిని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తిరస్కరించడంతో ఉరిశిక్షకు లైన్‌క్లియర్ అయ్యింది. ఈనెల 16న ఉదయం 5 గంటలకు నలుగురు దోషులకు ఉరిశిక్ష విధిస్తున్నట్లు తిహార్ జైలు అధికారులు తెలిపినట్లు వార్తలు వెలువడుతున్నాయి. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందినట్లు సమాచారం. ప్రస్తుతం వారున్న తిహార్ జైలులోనే వారిని ఉరి తీయనున్నట్లు తెలిసింది. ఈ మేరకు జైలు అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. 2012 డిసెంబర్ 16న ఆరుగురు కలిసి నిర్భయను అత్యంత దారుణంగా అత్యాచారం జరిపిన విషయం తెలిసిందే. అయితే ఆమెపై ఈ ఘాతుకానికి పాల్పడిన డిసెంబర్ 16నే నలుగురు దోషులను ఉరి

తీస్తుండటం విశేషం. దోషుల్లో ఒకరు జువైనల్ కస్టడీలో ఉండగా.. మరో దోషి రామ్‌సింగ్ జైలులోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ విషయం తెలిసిందే. కాగా దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన దిశ అత్యాచార నిందితుల ఎన్‌కౌంటర్ అనంతరం ప్రజల దృష్టి నిర్భయ ఘటన దోషులపైకి మళ్లిన విషయం తెలిసిందే. ఘటన జరిగి ఏడేళ్లకు పైగా గడుస్తున్నా.. దోషులకు పడిన ఉరిశిక్షను ఎందుకు అమలు చేయడంలేదని మహిళా సంఘాలతో సహా.. పలువురు ప్రముఖులూ ప్రశ్నిస్తున్నారు. శిక్ష అమలు చేయకపోవడంపై నిర్భయ తల్లి కూడా ఆగ్రహం వ్యక్తం చేసింది. తాజాగా ఈ నిర్ణయంతో వారి డిమాండ్ నెరవేరనుంది.

# డ్రగ్స్ కేసులో దొరికిన కాంగ్రెస్ నేత తనయుడు

హైదరాబాద్,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): డ్రగ్స్ కేసులో కాంగ్రెస్ నాయకుడు కత్తి వెంకటస్వామి కొడుకు చాణక్య అడ్డంగా దొరికిపోయాడు. డ్రగ్స్ కలిగి ఉండగా వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు చాణక్యను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడి నుంచి రూ.1.20 లక్షలు విలువ చేసే డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. గోవా నుంచి డ్రగ్స్ తీసుకువచ్చినట్లు పోలీసులు గుర్తించారు. తన బర్త్‌డే పార్టీ కోసం డ్రగ్స్ తెప్పించినట్లు పోలీసుల విచారణలో చాణక్య ఒప్పుకున్నాడు.

# జగన్‌రెడ్డి చేసే మేలు ఉల్లి కూడాచెయ్యదు!!

**– ట్విటర్‌లో సెటైర్లు వేసిన పవన్ కళ్యాణ్**

అమరావతి, డిసెంబర్9(ఆర్ఎన్ఎ) : వైసీపీ సర్కార్‌కు ఉల్లి ధరలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఒకపక్క ప్రధాన ప్రతిపక్షం టీడీపీ, మరోపక్క జనసేన ఉల్లిధరలపై ప్రభుత్వం ఘాటుగా విమర్శలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం జగన్‌పై జనసేన అధినేత పవన్ కల్యాణ్ సోమవారం సెటైరికల్‌గా ట్వీట్ చేశారు. ఉల్లి చేసిన మేలు తల్లి కూడా చెయ్యదంటారని.. కానీ జగన్ రెడ్డి చేసే మేలు ఉల్లి కూడా చెయ్యదని తనదైన శైలిలో విమర్శించారు. అందుకే ఉల్లి ఎందుకంటూ.. దాని రేటు పెంచేశారని సెటైర్ వేశారు. గత వారం రాయలసీమలో పర్యటించిన పవన్.. ఏపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడిన విషయం తెలిసిందే. ప్రభుత్వాల వైఫల్యం వల్లే ధరలు ఇంత ఎక్కువగా పెరిగాయని విమర్శించారు. పెరిగిన ఉల్లి ధరలతో మధ్యవర్తులే లాభపడుతున్నారని... రైతులు, వినియోగదారులు నష్టపోతున్నారన్నారు. ఉల్లి కోసం ప్రజలు రోజంతా వేచిచూసే పరిస్థితి రావడం దారుణమన్నారు.

నిల్చోబెట్టి చంపేకంటే.. వాలంటీర్లను ఉపయోగించుకోండి..

గుడివాడ రైతు బజార్‌లో ఉల్లిపాయల కోసం క్యూలైన్లో నిల్చొని.. సాంబయ్య రెడ్డి అనే వ్యక్తి గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ స్పందించారు. ట్విట్టర్ వేదికగా స్పందించిన ఆయన.. ప్రజలని క్యూలలో నుంచో పెట్టి చంపేకంటే, గ్రామ వాలంటీర్లను ఉపయోగించి, ప్రజలు ఇళ్ల దగ్గరికే.. కిలో 25 రూపాయలు చొప్పున ఎందుకు సరఫరా చేయట్లేదని ప్రశ్నించారు. దీనిపై జగన్ రెడ్డి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మతమార్పిళ్లు, కూల్చివేతలు, కాంట్రాక్టు రద్దుల మీద దృష్టి పెట్టిన వైసీపీ సర్కార్.. సగటు ప్రజల అవసరాల మీద, రైతుల కష్టాల మీద పెట్టుంటే బాగుండేదన్నారు.

# హైదరాబాద్‌లో జర్మనీ ఉత్పత్తులు




హైదరాబాద్, డిసెంబర్, 9: ప్రపంచవ్యాప్తంగా మన్నిక కలిగిన రెహావు పాలీమర్స్ తమ ఉత్పత్తులను నగరంలో రెహావు జర్మనీ క్వాలిటీ రౌకంటెక్స్ పరికరాలను నగర ప్రజల కోసం హైదరాబాద్ మార్కెట్‌లోకి ప్రవేశ పెట్టింది. కబోర్డులు, కిచెన్ క్యాబినెట్‌లు, కౌంటర్స్, టేబుల్ ఎడ్జ్‌ల వంటి అధునాతన ఫర్నిచర్‌ను ప్రవేశపెట్టింది. రెహావు సంస్థ వ్యాపార విస్తరణ ప్రణాళికలో భాగంగా ఇటీవల హైదరాబాద్‌కు చెందిన 140కి పైగా వ్యాపార భాగస్వామ్యంతో సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా సంస్థ దక్షిణాసియా చైర్మన్ అజయ్ ఖురానా మాట్లాడుతూ ఉత్పత్తి లభ్యత, అద్భుతమైన వినియోగదారుల అనుభవాలతో సంస్థను బలోపేతం చేసేందుకు వ్యూహాత్మక ప్రణాళికను ప్రారంభించిదని ఆజయ్ తెలిపారు. రెహావు ఇప్పటి వరకు అనేక వర్గాల్లో అద్భుతమైన ప్రగతిని సాధించామని, ప్రస్తుతం తమ వస్తువులకు విస్తృతమైన డిమాండ్ ఉందన్నారు. వినియోగదారుల అభిరుచికి తగ్గట్టుగా వస్తువులను అందిస్తున్నామని చెప్పారు. తమ సంస్థనుంచి కలర్ డెకర్స్, మ్యాజిక్ త్రీడీ, వి-గ్రోవ్ ఫుడ్ వెనీర్, మిర్రర్ గ్లాస్, రిటైల్ కలెక్షన్, వీ ల్విణ్, సూపర్ హైగ్లాస్ వంటి తొమ్మిది రకాల వస్తువులు అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు. ఆరు ఖండాల్లోని యాభై నాలుగు దేశాల్లో తమ సేవలు అందిస్తున్నామని, సుమారు ఇరవైవేల మంది ఉద్యోగులు తమ సంస్థలో పనిచేస్తున్నారని తెలిపారు.

# హైదరాబాద్‌లో పెరుగుతున్న ఇళ్ల ధరలు

హైదరాబాద్, డిసెంబర్, 9: దేశ వ్యాప్తంగా నిర్మాణ రంగంలో కరెక్షన్ కొనసాగుతున్న వేళ, హైదరాబాద్‌లోని రెసిడెన్షియల్ మార్కెట్ మాత్రం మంచి పూపుమీదుంది. హౌసింగ్ డాట్ కామ్, మకాన్, ప్రాప్ టైగర్ డాట్‌కామ్‌లు, సంయుక్తంగా రియల్ ఎస్టేట్ రంగంపై అధ్యయనం చేయగా ఈ విషయంలో వెళ్లడైంది. హైదరాబాద్ 2014 సెప్టెంబర్‌లో సరాసరిగా 3.587 రూపాయలుగా ఉన్న చదరపు అడుగు స్థలం ధర 2017లో 5,097 రూపాయలకు, 2019లో 5334 రూపాయలకు పెరిగిందని ఎలారా టెక్నాలజీస్ గ్రూప్ సీఇఓ ధ్రువ్ అగర్వాల్ వెల్లడించారు. 2014తో పోలిస్తే సరాసరి ధరలు 45శాతం మేరకు పెరిగాయని, ఇండియాలోని మరే నగరంలో ఈ స్థాయి పెరుగుదల నమోదు కాలేదని అన్నారు.

# ఎస్‌బిఐ ఖాతాదారులకు శుభవార్త

## కారు, గృహ, ఇతర రుణాలపై వడ్డీ రేట్ల తగ్గింపు

న్యూఢిల్లీ,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): ప్రభుత్వ రంగ బ్యాంక్ ఎస్‌బీఐ తన వినియోగదారులకు శుభవార్త చెప్పింది. కారు, గృహ, ఇతర రుణాలపై వడ్డీ రేట్లను తగ్గించింది. ఈ నిర్ణయం ఈ నెల 10వ తేదీ మంగళవారం నుంచి అమల్లోకి రానున్నాయని తెలిపింది. ఆ బ్యాంక్ ఎంసీఎల్ఆర్ వడ్డీ రేట్లను 10 బేసిస్ పాయింట్ల మేర తగ్గిస్తున్నట్లు వెల్లడించింది. ఈ క్రమంలో ఎస్‌బీఐ ఎంసీఎల్ఆర్ 8 నుంచి 7.90 శాతానికి తగ్గనుంది. దీంతో ఎంసీఎల్ఆర్‌కు అనుసంధామై ఉండే కారు, గృహ, ఇతర రుణాలపై వడ్డీ రేట్లు తగ్గుతాయని ఎస్‌బీఐ తెలిపింది. కాగా ఒక ఆర్థిక సంవత్సరంలో ఇలా ఎంసీఎల్ఆర్‌ను తగ్గించడం ఎస్‌బీఐకి ఇది 8వ సారి కావడం విశేషం. ఇక బ్యాంకులకు నిధులు లభించే రేటునే ఎంసీఎల్ఆర్ అంటారు. ఈ క్రమంలోనే తాము దేశంలోనే అతి తక్కువ వడ్డీ రేటుకు రుణాలను అందిస్తున్నామని ఎస్‌బీఐ తెలిపింది.

# భూ వివరాల్లో చాలా తేడాలున్నాయి

**– శాసన మండలిలో మంత్రి పిల్లి సుభాష్**

అమరావతి, డిసెంబర్9(ఆర్ఎన్ఎ) : గతంలో గ్రామాల్లో మునసబులు, కరణాల కాలంలో రెవెన్యూ రికార్డులు కచ్చితంగా ఉండేవని.. ఆ తర్వాత జరిగిన పరిణామాలతో రికార్డుల్లో తేడాలు వచ్చాయని డిప్యూటీ సీఎం, మంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. సోమవారం శాసన మండలిలో ఆయన మాట్లాడుతూ.. వెబ్‌ల్యాండ్ లెక్కలకు ఆర్ఎస్ఆర్ లెక్కలకు భూ వివరాల్లో చాలా తేడాలు ఉన్నాయని అన్నారు. ఇక తమ ప్రభుత్వం పక్కా ప్రణాళికతో భూ సర్వేలు నిర్వహిస్తుందని, రెవెన్యూ రికార్డులన్నింటినీ ప్రక్షాళన చేసి, జూన్ నుంచి జమాబంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వెల్లడించారు. అదేవిధంగా రవాణా శాఖ మంత్రి పేర్నినాని మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో లాగా ఆర్టీసీ బస్సులను, టాక్సీలను తమ ప్రభుత్వం వాడుకోవటం లేదని, అలాంటి అవసరం తమ ప్రభుత్వానికి లేదని టీడీపీని విమర్శించారు. దాదాపు 2,24,160 మంది ఆటో కార్మికులకు ఒక్కొక్కరికి రూ. 10,000 చొప్పున చెల్లించామని పేర్కొన్నారు. రాజకీయాలు పూర్తిగా దిగజారాయని, రాజకీయ అవసరాల కోసం కాకి బట్టలను అడిగి తెచ్చి బురద జల్లే ప్రయత్నం చేయొద్దని హితవు పలికారు. అలాగే గత ప్రభుత్వంలో రవాణా శాఖలో ఏం జరిగందో అందరికి తెలుసని మంత్రి వ్యాఖ్యానించారు.

## రైతుపేరుతో రాజకీయాలు చేయొద్దు – మంత్రి కన్నబాబు

రాష్ట్రంలో రైతుల ఇబ్బందులను తొలగించేందుకు సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నారని వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్నబాబు అన్నారు. శాసన మండిలిలో కన్నబాబు మాట్లాడుతూ.. గత తెలుగుదేశం ప్రభుత్వం రైతులను మోసం చేసిందని, వారి పట్ల టీడీపీకి చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. రుణమాఫీ చేయకపోవడం మా చేతకానితనమని టీడీపీ సభ్యులు ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు. రైతులను ఆదుకోవడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్లీనరీలో రైతు భరోసా పథకాన్ని ప్రకటించగా రైతుల ఇబ్బందులు చూసి 4 సంవత్సరాల పథకాన్ని 5 సంవత్సరాలకు పెంచారని ఆయన వివరించారు. రైతులకు ఇచ్చే సాయాన్ని రూ. 12,500 నుంచి రూ. 13,500లకు పెంచామని పేర్కొన్నారు. రైతుల పేరుతో రాజకీయం చేయొద్దని, రైతులకు రాజకీయాలతో ముడిపెట్టొద్దని మంత్రి హితవు పలికారు.

# సీఎల్పీ పదవికి సిద్ధరామయ్య రాజీనామా



బెంగళూరు , డిసెంబర్ 9: కర్ణాటక ఉప ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమికి బాధ్యత వహిస్తూ సీఎల్పీ పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేశారు. ప్రజాస్వామ్యాన్ని గౌరవించాల్సిన అవసరం ఉందని, అందుకే సీఎల్పీ పదవికి రాజీనామా చేశానని సిద్ధరామయ్య తెలిపారు. తన రాజీనామా లేఖను సోనియా గాంధీకి పంపానని ఆయన పేర్కొన్నారు. శాసనసభ ప్రతిపక్ష హోదా పదవికి కూడా రాజీనామా చేసినట్లు సిద్ధరామయ్య చెప్పారు. మొత్తం 15 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగ్గా.. కాంగ్రెస్ పార్టీ కేవలం 2 స్థానాల్లో మాత్రమే విజయం సాధించింది. బీజేపీ 12 స్థానాల్లో గెలిచింది. 224 అసెంబ్లీ స్థానాలున్న కర్ణాటకలో కాంగ్రెస్ ఎమ్మెల్యేల సంఖ్య కేవలం 68 మాత్రమే.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.